www.prajanaava.in

Telugu Daily

ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00

Published from: **Hyderabad, Rangareddy, Karimnagar** Circulated to: **Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad**

హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 77 | బుధవారం | 28 అక్టోబర్, 2026

ప్రపంచానికి భారత్ దిశానిర్దేశం చేయాలి

- ప్రధాని నరేంద్ర మోడీ

2





విద్యుద్దీపకాంతుల్లో

స్వర్ణదేవాలయం

సిక్కుల నాలుగో గురువు గురు రామ్‌దాస్ జయంతిని పురస్కరించుకుని పంజాబ్‌లోని అమృత్‌సర్ స్వర్ణదేవాలయం మంగళవారం విద్యుద్దీపాల కాంతుల్లో మెరిసిపోయింది. ఈ సందర్భంగా ఆకాశంలో బాణసంచా వెలుగులు విరజిమ్మగా, ఆలయ పరిసరాల్లో సందడి నెలకొంది. ఈ వేడుకలను తిలకించేందుకు భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

– అమృత్‌సర్

తీరం వైపు అర్నబ్

ఏపీకి భారీ తుపాను ముప్పు హెచ్చరిక

- 125–135 కి.మీ. వేగంతో ఈదురుగాలులు
- యానాం సమీపంలో తీరం దాటే అవకాశం
- తెలంగాణలోనూ భారీ నుంచి అతి భారీ వర్షాలు
- పలు విమానాల రద్దు

ప్రజానావ, హైదరాబాద్: అతి తీవ్ర తుపాను 'అర్నబ్' నేడు(బుధవారం) ఉదయం బాపట్ల – విశాఖపట్నం మధ్య యానాం సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. తీరం దాటే సమయంలో గంటకు 125 – 135 కి.మీ. వేగంతో గాలులు, గరిష్ఠంగా 150 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీయవచ్చని హెచ్చరించింది. ఉత్తర కోస్తాలో భారీ వర్షాలు కురిసే అవకాశముంది. ఉప్పాడ, కోనపాపేట, మూలపేట తీరాల్లో అలల ఉద్ధృతి పెరిగింది. రాష్ట్రంలోని 20 జిల్లాల్లో 2,131 పునరావాస కేంద్రాలు సిద్ధం చేశారు. ఇప్పటికే 1,351 మంది గర్భిణులను ఆస్పత్రులకు తరలించారు. 1,087 వైద్య బృందాలు, 8,281 అత్యవసర పడకలు, 1,274 అంబులెన్సులను అందుబాటులో ఉంచారు. 14,686 రేషన్ దుకాణాల్లో రెండు నెలలకు సరిపడా నిత్యావసరాలు నిల్వ చేశారు. 30 వేలకు పైగా మత్స్యకార పడవలను సురక్షితంగా ఉంచారు. తుపాను ప్రభావంతో విమాన సర్వీసులు రద్దు కాగా, తీరప్రాంత రహదారులపై ఆంక్షలు విధించారు. విజయవాడ, విశాఖపట్నం



రైల్వే డివిజన్ల పరిధిలో 600 కి.మీ. ట్రాక్‌లపై నిఘా ఏర్పాటు చేశారు. ఇక తుపాను ప్రభావంతో ఒడిశాలో భారీ వర్షాలు కురుస్తుండటంతో సుమారు 48 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు చేపట్టారు. 135 శాశ్వత, 1,600 తాత్కాలిక పునరావాస కేంద్రాలను సిద్ధం చేశారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖలకు చెందిన 294 సహాయక బృందాలను రంగంలోకి దించారు. ఎనిమిది జిల్లాల్లో పాఠశాలలకు సెలవు ప్రకటించారు.

పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలర్ట్

పలు జిల్లాలకు భారీ వర్షాలపై ఆరెంజ్, పసుపు హెచ్చరికలు జారీ చేశారు. ఆకస్మిక వరదలు, నీటిముంపు ప్రమాదం ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. పశ్చిమబెంగాల్‌లోని దక్షిణ 24 పరగణాలు, తూర్పు మేదినీపూర్, హౌరా, కోల్‌కతా తదితర ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. అక్టోబర్ 28, 29 తేదీల్లో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. విజయవాడ, విశాఖపట్నం విమానాశ్రయాల్లో విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. మంగళవారం ఈ రెండు విమానాశ్రయాల్లో కలిపి కనీసం 21 విమానాలను రద్దు చేసినట్లు అధికారులు వెల్లడించారు. విజయవాడ విమానాశ్రయంలో మంగళవారం ఐదు విమానాలు రద్దయ్యాయి. వీటిలో ఇండిగోకు చెందిన నాలుగు, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌కు చెందిన ఒక విమానం ఉన్నాయి.

రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు

బంగాళాఖాతంలో ఏర్పడిన అతి తీవ్ర తుపాను అర్నాబ్ ప్రభావంతో తెలంగాణలో నేడు పలుచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని మంగళవారం విడుదల చేసిన బులెటిన్‌లో పేర్కొంది. నేడు, ఎల్లుండి రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని పేర్కొంది. రేపు చాలా ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే సూచనలున్నాయని పేర్కొంది. నేడు, ఎల్లుండి ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

రూ.11వేల ఇంజెక్షన్..
1.30 లక్షలా?



2

- మందుల ధరల్లో దోపిడీపై సుప్రీం ఆగ్రహం
- ధరల నియంత్రణపై కేంద్రానికి ప్రశ్నలు
- తీర్పు రిజర్వు చేసిన అత్యున్నత న్యాయస్థానం

బాధితులనే బలి చేయొద్దు


- మహిళల భద్రతపై ఎన్‌హెచ్ఆర్‌సీ కీలక సూచనలు
- ఫిర్యాదుదారులపై నైతిక తీర్పులు, అవమానకర వ్యాఖ్యలు వద్దు
- నేరాలు జరిగే ప్రాంతాల్లో పోలీసుల నిరంతర గస్తీ
- ప్రతి పోలీస్‌స్టేషన్‌లో మహిళా హెల్ప్‌డెస్క్ తప్పనిసరి
- సైబర్ వేధింపులు, డీప్‌ఫేక్‌లపై మహిళలకు అవగాహన
- రెండు నెలల్లో చర్యల నివేదిక ఇవ్వాలని ప్రభుత్వాలకు ఆదేశం

2

రేపటి నుంచి ముఖ్యమంత్రి ఢిల్లీ టూర్

- మూడు రోజుల పాటు హస్తినలోనే మకాం
- గ్లోబల్ సమ్మిట్‌కు పారిశ్రామిక దిగ్గజాలకు ఆహ్వానాలు
- ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టాలని కంపెనీలకు విజ్ఞప్తి
- కేంద్ర మంత్రులతోనూ భేటీ అయ్యే అవకాశం

ప్రజానావ, హైదరాబాద్: రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు, రాబోయే గ్లోబల్ సమ్మిట్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి దేశ రాజధాని ఢిల్లీకి వెళ్లనున్నారు. ఈ నెల 29 (గురువారం) నుంచి మూడు రోజుల పాటు హస్తినలో పర్యటించనున్న సీఎం.. పారిశ్రామిక దిగ్గజాలు, వివిధ కంపెనీల అధినేతలతో సమావేశమయ్యే అవకాశముంది. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026'కు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పారిశ్రామిక సంస్థలను ఆహ్వానించడంతో పాటు.. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించడంపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. రాజకీయ, పారిశ్రామిక, పరిపాలనా అంశాలతో రేవంత్ ఢిల్లీ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. గ్లోబల్ సమ్మిట్ వేదికగా కొత్త పెట్టుబడులను ఆకర్షించడంలో భారత్ ఫ్యూచర్ సిటీ కీలకంగా నిలవనుంది. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ నగరాన్ని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ క్రమంలో ఢిల్లీలో వివిధ కంపెనీల ప్రతినిధులతో జరిపే చర్చల్లో ఫ్యూచర్ సిటీని ప్రత్యేకంగా ప్రస్తావించే అవకాశముంది. అక్కడ పరిశ్రమలు, అంతర్జాతీయ సంస్థలు, అత్యాధునిక సాంకేతిక రంగాలకు చెందిన కంపెనీలు తమ కార్యకలాపాలు ప్రారంభించేలా ప్రోత్సహించాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది. అంతర్జాతీయ సంస్థలను సమ్మిట్‌కు రప్పించడంతో పాటు, వాటి ప్రతినిధులతో చర్చలు జరిపి రాష్ట్రంలో పెట్టుబడులకు సంబంధించిన తరువాయి 2లో..



రేపటి నుంచి ముఖ్యమంత్రి ఢిల్లీ టూర్

(మొదటిపేజీ తరువాయి)

అవగాహన ఒప్పందాలు కుదుర్చుకునే దిశగా ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇప్పటికే వివిధ రంగాలకు చెందిన సంస్థలను సమ్మిట్‌కు ఆహ్వానించే కార్యక్రమం కొనసాగుతుండగా.. సీఎం పర్యటనతో ఈ ప్రయత్నాలకు మరింత ఊతం లభిస్తుందని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి.

రాహుల్‌తో కలిసి 'ఓట్ బచావో–దేశ్ బచావో'

నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించనున్న 'ఓట్ బచావో–దేశ్ బచావో' భారీ ర్యాలీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొనున్నారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సహా పార్టీ ముఖ్య నేతలు హాజరుకానున్నారు. ర్యాలీలో రాహుల్‌గాంధీతో కలిసి సీఎం పాల్గొననున్నట్లు సమాచారం. ఈ కార్యక్రమానికి తెలంగాణ నుంచి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లేలా పార్టీ నాయకత్వం ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్ర స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తల భాగస్వామ్యంతో ర్యాలీని విజయవంతం చేయాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఈ నేపథ్యంలో సీఎం పర్యటనకు పార్టీ పరంగా కూడా ప్రాధాన్యం ఏర్పడింది. ఢిల్లీ పర్యటనలో సమయం అనుకూలిస్తే పలువురు కేంద్ర మంత్రులతోనూ సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యే అవకాశముందని తెలుస్తోంది. రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ ప్రాజెక్టులు, కేంద్రం నుంచి రావాల్సిన సహకారం, వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అంశాలను వారి దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంది.

బాధితులనే బలి చేయొద్దు

- మహిళల భద్రతపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ కీలక సూచనలు

న్యూఢిల్లీ: లైంగిక, లింగ ఆధారిత హింస బాధితులు పోలీస్‌స్టేషన్లకు ఫిర్యాదు చేసేందుకు వచ్చినప్పుడు వారిని అవమానించడం, నైతికంగా తప్పుబట్టడం వంటి చర్యలకు స్వస్తి పలకాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) సూచించింది. మహిళల భద్రత కోసం పోలీసులకు తగిన అవగాహన కల్పించాలని, నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో క్రమం తప్పకుండా గస్తీ నిర్వహించాలని ప్రభుత్వ విభాగాలకు సిఫారసు చేసింది. కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో మహిళలపై వేధింపులు, వారి చట్టపరమైన హక్కుల గురించి తెలియజేసే పోస్టర్లు, కరపత్రాలు ఏర్పాటు చేయాలని పేర్కొంది. మహిళల భద్రతపై అక్టోబరు 23న జారీ చేసిన మార్గదర్శకాలను కమిషన్ మంగళవారం వెల్లడించింది. కేంద్రంలోని మహిళా, శిశు అభివృద్ధి, విద్య, ఆరోగ్యం, హోంశాఖ సహా పది మంత్రిత్వ శాఖల కార్యదర్శులకు, రైల్వే బోర్డు ఛైర్‌పర్సన్, సీఈవోకు, అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, కేంద్రపాలిత ప్రాంతాల పరిపాలకులకు వీటిని పంపించింది. సిఫారసుల అమలుపై రెండు నెలల్లోగా నివేదిక ఇవ్వాలని కోరింది.

బాధితులపై సున్నితంగా వ్యవహరించాలి

లింగ ఆధారిత హింసకు గురైన మహిళలు పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేసేందుకు వెళ్లినప్పుడు కొన్నిసార్లు ప్రతిఘటన, నైతిక పోలీసింగ్‌ను ఎదుర్కొంటున్నారని కమిషన్ పేర్కొంది. ఇలాంటి సందర్భాల్లో పోలీసులు బాధితులను నిందించడం, వారి ప్రవర్తనపై తీర్పులివ్వడం మానుకోవాలని సూచించింది. బాధితులతో వ్యవహరించేందుకు స్పష్టమైన నిబంధనలతో కూడిన ప్రామాణిక కార్యాచరణ విధానాన్ని రూపొందించి, విస్తృతంగా ప్రచారం చేయాలని సంబంధిత మంత్రిత్వ శాఖకు సూచించింది. బహిరంగ ప్రదేశాల్లో హింస జరిగినప్పుడు హెల్ప్‌లైన్ల స్పందన, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునే సమయంపై నిర్దిష్ట గడువులు నిర్ణయించాలని పేర్కొంది. ముఖ్యంగా రాత్రివేళ నిర్మానుష్యంగా ఉండే ప్రాంతాలు, నేరాలు ఎక్కువగా జరిగే ప్రదేశాల్లో పోలీసులు తరచూ గస్తీ నిర్వహించాలని సూచించింది.

ప్రతి స్టేషన్‌లో మహిళా హెల్ప్‌డెస్క్

2025 డిసెంబరు నాటికి దేశవ్యాప్తంగా 16,109 పోలీస్‌స్టేషన్లలో 14,658 చోట్ల (89 శాతం) మహిళా హెల్ప్‌డెస్క్‌లు ఉన్నట్లు కేంద్ర హోంశాఖ గణాంకాలను కమిషన్ ప్రస్తావించింది. మిగిలిన పోలీస్‌స్టేషన్లలోనూ మహిళా హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసి, అవి సమర్థంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. మహిళల భద్రతకు సంబంధించి సమాజంలో ఉన్న దృక్పథాలు, ఆలోచనా విధానాల్లో మార్పు రావాల్సిన అవసరం ఉందని పేర్కొంది. లైంగిక వేధింపులు అంటే ఏమిటి? అలాంటి ఘటనలు ఎదురైతే ఎక్కడ ఫిర్యాదు చేయాలి? బాధితులకు అందుబాటులో ఉన్న చట్టపరమైన రక్షణలు ఏమిటి? వంటి అంశాలపై విస్తృత అవగాహన కల్పించాలని తెలిపింది.

డీప్‌ఫేక్‌లు, సైబర్ వేధింపులపై అప్రమత్తం

మహిళలపై హింస భౌతిక దాడులకే పరిమితం కావడం లేదని ఎన్‌హెచ్‌ఆర్‌సీ హెచ్చరించింది. కృత్రిమ మేధ సహా డిజిటల్ సాంకేతికత విస్తరణతో సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా జరిగే లింగ వివక్ష, వేధింపుల ఘటనలు ఇటీవలి సంవత్సరాల్లో గణనీయంగా పెరిగాయని తెలిపింది. ప్రతీకారంగా వ్యక్తిగత చిత్రాలను ప్రచారం చేయడం, వ్యక్తిగత వివరాలను బహిర్గతం చేయడం, అనుమతి లేకుండా అసభ్యకర చిత్రాలు, వీడియోలను పంచుకోవడం, డీప్‌ఫేక్‌ల సృష్టి వంటి ముప్పులపై అన్ని వయసుల మహిళలకు అవగాహన కల్పించాలని సూచించింది. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, కార్యాలయాల్లో సైబర్ నేరాలపై కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొంది. జాతీయ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్, 'సహయోగ్' పోర్టల్, లైంగిక వేధింపుల ఫిర్యాదుల కోసం అందుబాటులో ఉన్న 'షీ–బాక్స్' వంటి వేదికల గురించి మహిళలకు తెలియజేయాలని సిఫారసు చేసింది. అత్యవసర ఫోన్ నంబర్లు, ఫిర్యాదు విధానాలను బహిరంగ ప్రదేశాలు, కార్యాలయాల్లో ప్రదర్శించాలని సూచించింది. మహిళల భద్రతకు నివారణ చర్యలతోపాటు, వేధింపులు ఎదురైనప్పుడు తక్షణ పరిష్కారం కల్పించే వ్యవస్థలూ అవసరమని కమిషన్ స్పష్టం చేసింది.

భారత్–లీచెన్‌స్టైన్ బంధానికి కొత్త బాట

- ప్రధాని మోదీతో ప్రిన్స్ అలోయిస్ విస్తృత చర్చలు
- వాణిజ్యం, సాంకేతికత, పెట్టుబడులు, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం

న్యూఢిల్లీ: భారత్–లీచెన్‌స్టైన్ ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే దిశగా కీలక ముందడుగు పడింది. ప్రధాని నరేంద్ర మోదీ, లీచెన్‌స్టైన్ ప్రిన్స్ అలోయిస్ మంగళవారం విస్తృత చర్చలు జరిపారు. వాణిజ్యం, సాంకేతికత, పెట్టుబడులు, ప్రతిభావంతుల రాకపోకలు సహా పలు రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకోవడంపై దృష్టి సారించారు. నాలుగు రోజుల పర్యటనలో భాగంగా ఆదివారం భారత్‌కు చేరుకున్న అలోయిస్‌తోపాటు ఆయన భార్య ప్రిన్సెస్ సోఫీ, ప్రముఖ పారిశ్రామికవేత్తలతో కూడిన ప్రతినిధి బృందం కూడా పర్యటిస్తోంది. వాణిజ్యం, పెట్టుబడులు, అధునాతన తయారీ, సాంకేతికత, ఆవిష్కరణలు, ఆర్థిక సేవలు, వ్యవసాయం, అంతరిక్షం, విద్య, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో సంబంధాల విస్తరణపై చర్చించినట్లు విదేశాంగ శాఖ పశ్చిమ విభాగ కార్యదర్శి సిబి జార్జ్ తెలిపారు. ద్వంద్వ పన్నుల నివారణ ఒప్పందం కుదుర్చుకునే అవకాశాన్ని పరిశీలించినట్లు వెల్లడించారు. వాణిజ్యం, సాంకేతికత, ప్రతిభావంతులైన మానవ వనరులు అనే మూడు అంశాలకు ప్రాధాన్యమిస్తూ సహకారాన్ని విస్తరించాలని ఇరుపక్షాలు నిర్ణయించినట్లు వివరించారు.

ఈఎఫ్‌టీఏ ఒప్పందంతో కొత్త అవకాశాలు

భారత్, యూరోపియన్ స్వేచ్ఛా వాణిజ్య సంఘం (ఈఎఫ్‌టీఏ) మధ్య కుదిరిన వాణిజ్య, ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (టీఈపీఏ) అమల్లోకి వచ్చిన ఏడాదికి పైగా తర్వాత అలోయిస్ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. ఐస్‌లాండ్, లీచెన్‌స్టైన్, నార్వే, స్విట్జర్లాండ్ సభ్యులుగా ఉన్న ఈఎఫ్‌టీఏతో భారత్ 2024 మార్చిలో ఒప్పందంపై సంతకాలు చేసింది. దాదాపు 16 ఏళ్ల చర్చల అనంతరం కుదిరిన ఈ ఒప్పందం గతేడాది అక్టోబరులో అమల్లోకి వచ్చింది. దీని ప్రకారం వచ్చే 15 ఏళ్లలో భారత్‌లో 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టాలని ఈఎఫ్‌టీఏ దేశాలు లక్ష్యంగా పెట్టుకున్నాయి. అలోయిస్ పర్యటన భారత్–లీచెన్‌స్టైన్ సంబంధాల్లో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని సిబి జార్జ్ పేర్కొన్నారు. రాజకీయ సంబంధాలను ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంతోపాటు సంస్థాగత అనుబంధాలను బలోపేతం చేసి, సహకారానికి కొత్త అవకాశాలు కల్పిస్తుందని చెప్పారు. చర్చల్లో కుదిరిన అవగాహనలను నిర్దిష్ట ప్రాజెక్టులు, భాగస్వామ్యాలు, ఫలితాలుగా మార్చడమే లక్ష్యమని వివరించారు.



'అర్నబ్' తుపాను తీరం దాటే అవకాశం ఉండడంతో ఒడిశాలోని పూరీ, ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం తీర ప్రాంతాల్లో అప్రమత్తత నెలకొంది. తుపాను ముప్పు నేపథ్యంలో పూరీ బీచ్ మంగళవారం పర్యాటకులు, సందర్శకులు లేక వెలవెలబోయింది. సముద్ర తీరంలో ప్రమాద హెచ్చరికగా ఎర్ర జెండాను ఎగురవేశారు. మరోవైపు విశాఖపట్నం తీరంలో భారీ వర్షం, బలమైన ఈదురుగాలులు వీయడంతో మత్స్యకారుల పడవలను ఒడ్డునే నిలిపివేశారు.
– పూరీ/విశాఖపట్నం

తెలంగాణ ప్రతిష్ట చాటేలా గ్లోబల్ సమ్మిట్

డిసెంబర్ 7 నుంచి ఫ్యూచర్ సిటీలో ఇన్వెస్ట్ తెలంగాణ సదస్సు

- రక్షా ఎక్స్‌పో, ఇండియా జాయ్ ఈవెంట్లకు ప్రత్యేక ప్రాధాన్యం
- రేపు ఢిల్లీలో కర్టెన్ రైజర్.. ఏర్పాట్లపై సీఎం సమీక్ష
- నవంబర్ మొదటి వారంలోగా సమగ్ర ప్రణాళికలు ఖరారు చేయాలని ఆదేశం

ప్రజానావ, హైదరాబాద్: ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026 ద్వారా రాష్ట్ర ప్రతిష్ఠను అంతర్జాతీయ స్థాయిలో చాటేలా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. డిసెంబరు 7 నుంచి 9వ తేదీ వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న ఈ సదస్సుకు దేశవిదేశాల నుంచి వచ్చే పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు, ప్రముఖులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. రేపు(గురువారం) న్యూఢిల్లీలో నిర్వహించనున్న కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్పష్టం చేశారు. సమ్మిట్ ఏర్పాట్ల పురోగతిపై మంగళవారం అధికారులతో సమీక్ష నిర్వహించిన సీఎం.. వివిధ కార్యక్రమాలు, పెట్టుబడిదారులతో సమావేశాలు, రక్షా ఎక్స్‌పో, ఇండియా జాయ్ ఈవెంట్ల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. నవంబర్ మొదటి వారంలోగా అన్ని కార్యక్రమాలకు సంబంధించిన ప్రణాళికలను ఖరారు చేయాలని ఆదేశించారు. వివిధ దేశాలు, రాష్ట్రాల నుంచి వచ్చే ప్రతినిధులకు వసతి, రవాణా, ఇతర సదుపాయాల విషయంలో సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. టెక్నాలజీ, ఫార్మా, ఏరోస్పేస్ తదితర రంగాల్లో తెలంగాణ సాధించిన పురోగతిని ప్రపంచానికి పరిచయం చేసేలా హైదరాబాద్‌లో ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సీఎం సూచించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా ప్రచారం నిర్వహించే అవకాశాలను పరిశీలించాలని ఆదేశించారు. వాతావరణ మార్పులు, కృత్రిమ మేధ (ఏఐ) రంగాల్లో అంతర్జాతీయ గుర్తింపు పొందిన ప్రముఖులను ఆహ్వానించి, సాంకేతిక పరిణామాలు, పెట్టుబడుల అవకాశాలపై చర్చలకు వేదిక కల్పించాలని పేర్కొన్నారు. యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ (ఏవీజీసీ) రంగాల్లో తెలంగాణకు ఉన్న అవకాశాలను అంతర్జాతీయ ప్రతినిధులకు పరిచయం చేసేలా ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించాలని సూచించారు.



తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టాలి

సమ్మిట్ ప్రాంగణంలో రాష్ట్ర సంప్రదాయాలు, సంస్కృతి, చారిత్రక వైభవం ప్రతిబింబించేలా ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. కాకతీయ కళాతోరణం, రామప్ప ఆలయ నిర్మాణ శైలికి ప్రాధాన్యం ఇవ్వాలని, బతుకమ్మ పండుగ విశిష్టతను విదేశీ అతిథులకు పరిచయం చేసేలా ప్రత్యేక డిజైన్లు, ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సూచించారు. పారిశ్రామిక పెట్టుబడులతోపాటు తెలంగాణ వారసత్వ సంపద, కళలు, సంప్రదాయాలను ప్రపంచానికి చాటేలా సదస్సు నిర్వహణ ఉండాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, టీజీఐఐసీ ఎండీ శశాంక, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణాదిత్య, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ బి. అజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచానికి భారత్ దిశానిర్దేశం చేయాలి

- పరిశోధనలు, ఆవిష్కరణల్లో ధైర్యంగా ముందడుగు వేయాలి
- ఏఐ, క్వాంటం భద్రతా పరిష్కారాలపై దృష్టి పెట్టాలి
- పరిశోధన, అభివృద్ధికి ఏడాదిలో రూ.24 వేల కోట్ల పెట్టుబడులు
- ఎమర్జింగ్ సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ కాన్‌క్లేవ్‌లో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: భవిష్యత్తు సాంకేతికతలను అందిపుచ్చుకోవడమే కాకుండా, వాటి అభివృద్ధిలో ప్రపంచానికి భారత్ నాయకత్వం వహించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. పరిశోధనలు, ఆవిష్కరణల్లో ధైర్యంగా ముందడుగు వేస్తూ, దేశ అవసరాలతోపాటు ప్రపంచ సమస్యలకు పరిష్కారాలు చూపే సాంకేతికతలను అభివృద్ధి చేయాలని సూచించారు. మంగళవారం ఢిల్లీలో జరిగిన ఎమర్జింగ్ సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ కాన్‌క్లేవ్ (ఈఎస్‌టీఐసీ) –2026లో ఆయన ప్రసంగించారు. గతంలో ప్రపంచంలో అభివృద్ధి చెందిన సాంకేతికతలను భారత్ కొంతకాలం తర్వాత స్వీకరించేదని మోదీ గుర్తుచేశారు. ఇప్పుడు కొత్త ఆలోచనలు, ఆత్మవిశ్వాసంతో దేశం ముందుకు సాగుతోందని చెప్పారు. కృత్రిమ మేధ (ఏఐ) సాధారణ పనులను వేగంగా పూర్తి చేయగలిగినా, అది స్వతంత్ర ఆలోచనలను పరిమితం చేయకూడదని స్పష్టం చేశారు. పరిశోధకులు ఆదా చేసిన సమయాన్ని కొత్త ప్రయోగాలు, క్లిష్టమైన సమస్యల పరిష్కారానికి వినియోగించాలని సూచించారు. ఏఐ యుగంలో ఆర్థిక వ్యవస్థలు, జాతీయ భద్రతకు సైబర్ ముప్పులు పెరుగుతున్నాయని మోదీ హెచ్చరించారు. కీలక వ్యవస్థల రక్షణకు ఏఐ ఆధారిత, క్వాంటం సాంకేతికతలతో కూడిన భద్రతా పరిష్కారాలను అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు. దేశానికి బలాన్నిచ్చే సాంకేతికతలు మానవాళి సమస్యల పరిష్కారానికీ ఉపయోగపడాలని పేర్కొన్నారు. అణుశక్తి, అంతరిక్షం, సెమీకండక్టర్లు, బ్యాటరీ నిల్వ సాంకేతికతల్లో భారత్ సాధిస్తున్న పురోగతిని ప్రస్తావించారు. అభివృద్ధి చెందిన భారత్ నిర్మాణానికి పెద్దఎత్తున అణుశక్తి అవసరమని, అందుకే ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ సాంకేతికతను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. తమిళనాడులోని కల్పక్కంలో స్వదేశీ ప్రోటోటైప్ ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ కీలక దశకు చేరడం ముఖ్యమైన మైలురాయిగా అభివర్ణించారు. స్వదేశీ చిప్‌ల తొలి సరఫరాలు విదేశాలకు చేరుతున్నాయని, బ్యాటరీ నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు దేశీయ వనరులను వినియోగిస్తున్నామని మోదీ తెలిపారు. డిజిటల్ వ్యవస్థలు, స్వదేశీ 5జీ సాంకేతికత ద్వారా పెద్ద సంఖ్యలో ప్రజలకు పరిష్కారాలు అందించే సామర్థ్యం భారత్‌కు ఉందన్నారు. పరిశోధన రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని చెప్పారు. మార్కెట్‌కు సిద్ధంగా ఉన్న ప్రయోగశాల సాంకేతికతల అభివృద్ధి కోసం గత ఏడాది ప్రభుత్వం కేటాయించిన రూ.12 వేల కోట్లకు సమానంగా ప్రైవేటు పెట్టుబడులు కూడా సమకూరాయని వెల్లడించారు.



నమ్మించి తెచ్చి.. నిర్బంధించి!

- మయన్మార్ యువతిపై హైదరాబాద్‌లో లైంగిక దాడి?
- భర్త, అతడి స్నేహితుల వేధింపులు.. బయటకు చెబితే చంపేస్తామని బెదిరింపులు
- ఇంటి యజమాని రాకతో బయటపడ్డ బాధితురాలు
- కంచన్‌బాగ్ పీఎస్‌లో ఫిర్యాదు
- పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు
- పరారీలో ప్రధాన నిందితుడు

ప్రజానావ, హైదరాబాద్: నగరంలో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. మయన్మార్‌కు చెందిన 18 ఏళ్ల యువతిని అద్దె ఇంట్లో నిర్బంధించి, పలుమార్లు లైంగిక దాడికి పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదుపై పోలీసులు ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలో ప్రధాన నిందితుడైన బాధితురాలి భర్త పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం.. తనను పెళ్లి చేసుకుంటానని హామీ ఇచ్చిన వ్యక్తితో కలిసి బాధితురాలు 2026 మేలో హైదరాబాద్‌కు వచ్చింది. అనంతరం ఇద్దరూ వివాహం చేసుకుని అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. కొంతకాలానికి ఆమె భర్త తన ముగ్గురు స్నేహితులను కూడా అదే ఇంట్లో ఉండేందుకు తీసుకొచ్చాడు. భర్త బయటకు వెళ్లే సమయంలో ఇంటికి తాళం వేసి వెళ్లేవాడని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. ఈ క్రమంలో భర్త స్నేహితులు వేర్వేరు సందర్భాల్లో తనపై లైంగిక దాడికి పాల్పడ్డారని, ఈ విషయం ఎవరికైనా చెబితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని బెదిరించారని ఆరోపించింది.

ఇంటి యజమాని రాకతో వెలుగులోకి..

అక్టోబరు 23న బకాయి అద్దె వసూలు చేసేందుకు వచ్చిన ఇంటి యజమానికి తలుపుకు బయట నుంచి తాళం వేసి ఉండటం అనుమానం కలిగించింది. దీంతో తాళం పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా, గదిలో బాధితురాలు కనిపించింది. అనంతరం ఆమె తన కుటుంబ సభ్యులను సంప్రదించగా, వారు నగరంలోని బాలాపూర్‌లో నివసిస్తున్న బంధువు ఇంటికి తీసుకెళ్లారు. ఈ నెల 26న బాధితురాలు కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా అక్రమ నిర్బంధం, లైంగిక దాడి, నేరపూరిత బెదిరింపులకు సంబంధించిన భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకోగా, ప్రధాన నిందితుడైన భర్త పరారీలో ఉన్నాడు. అతడి కోసం గాలిస్తున్నామని, కేసుపై దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

రూ.11వేల ఇంజెక్షన్.. 1.30 లక్షలా?

- మందుల ధరల్లో దోపిడీపై సుప్రీం ఆగ్రహం
- ధరల నియంత్రణపై కేంద్రానికి ప్రశ్నలు
- తీర్పు రిజర్వు చేసిన అత్యున్నత న్యాయస్థానం

న్యూఢిల్లీ: మందుల కొనుగోలు ధరలకు, ఆసుపత్రులు రోగుల నుంచి వసూలు చేస్తున్న మొత్తాలకు మధ్య భారీ వ్యత్యాసంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆసుపత్రులు ఇలాంటి అధిక ధరలతో 'దోపిడీ'కి పాల్పడుతూ మనుగడ సాగించలేవని వ్యాఖ్యానించింది. ఔషధాల ధరల నియంత్రణలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని ప్రశ్నించింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం మంగళవారం ఈ అంశంపై విచారణ జరిపి తీర్పును రిజర్వు చేసింది. క్యాన్సర్ చికిత్స పొందుతున్న తన భార్యకు ఇవ్వాల్సిన కీమోథెరపీ ఇంజెక్షన్ గురించి ఓ ఔషధ పంపిణీదారుడు ఆసుపత్రిని సంప్రదించిన ఉదంతాన్ని ధర్మాసనం ప్రస్తావించింది. ఆ ఇంజెక్షన్ తనకు డీలర్ ధర రూ.11 వేలకే లభిస్తుందని చెప్పినా, ఆసుపత్రి అదే మందుకు రూ.1.30 లక్షలు వసూలు చేసిందని తెలిపింది. ఇంత భారీ వ్యత్యాసానికి కారణమేంటని, ఈ ధరను ఎలా సమర్థించగలరని కేంద్రాన్ని ప్రశ్నించింది. మందుల గరిష్ఠ చిల్లర ధర (ఎంఆర్‌పీ), చిల్లర వ్యాపారులకు సరఫరా చేసే ధర మధ్య వ్యత్యాసాన్ని ధర్మాసనం తప్పుబట్టింది. జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ (ఎన్‌పీపీఏ) పనితీరుపైనా అసంతృప్తి వ్యక్తం చేసింది. మందుల ధరల నియంత్రణ విషయంలో ప్రభుత్వం మరింత సమర్థంగా వ్యవహరించాలని సూచించింది. భారత్‌లో మందుల ధరలు ప్రపంచంలోని ఇతర దేశాలతో పోలిస్తే తక్కువగా ఉన్నాయని కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి వాదించారు. అయితే, తలసరి ఆదాయం తక్కువగా ఉన్న దేశంలో రోగులకు చికిత్స ఎంతవరకు అందుబాటులో ఉందన్నదే ముఖ్యమని ధర్మాసనం పేర్కొంది. రోగుల అవసరాల కంటే వాణిజ్య ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వకూడదని స్పష్టం చేసింది.



ఇతర మందులకు ఎందుకు వర్తింపజేయొద్దు

క్యాన్సర్ మందులపై వాణిజ్య మార్జిన్‌ను 30 శాతానికి పరిమితం చేయాలని కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని కూడా కోర్టు ప్రస్తావించింది. ఈ పరిమితి ఇతర మందులకు ఎందుకు వర్తింపజేయకూడదని ప్రశ్నించింది. ఔషధాల ధరల నియంత్రణకు సంబంధించిన నిబంధనలు అన్ని మందులకు సమర్థంగా వర్తిస్తున్నాయా అనే అంశంపై వివరణ కోరింది. మందుల ధరల నియంత్రణ, జనరిక్ మందుల ప్రిస్క్రిప్షన్లు తప్పనిసరి చేయడం, వైద్య పరికరాల ధరలకు పరిమితులు విధించడం వంటి అంశాలపై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని ధర్మాసనం విచారించింది. ఆసుపత్రుల నిర్వహణ ఖర్చులు, మందుల భద్రత వంటి అంశాలను ప్రైవేటు ఆసుపత్రుల తరఫు న్యాయవాది ముకుల్ రోహత్గీ ప్రస్తావించారు. అయితే, నిర్వహణ ఖర్చుల పేరుతో మందుల ధరలను అసాధారణంగా పెంచడాన్ని సమర్థించలేమని కోర్టు స్పష్టం చేసింది. విచారణ అనంతరం ధర్మాసనం తీర్పును రిజర్వు చేసింది.



జవహర్‌నగర్ ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేయాలి

- రూ.1.65 కోట్లతో మంజూరైన ఆసుపత్రి పనులకు అడ్డంకులు తొలగించాలి
- అర్హులైన పేదలందరికీ పింఛన్లు అందేలా రీ-వెరిఫికేషన్ చేపట్టాలి

ప్రజానావ, హైదరాబాద్ : జవహర్‌నగర్‌లో స్థానిక ప్రజలు, ముఖ్యంగా గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రూ.1.65 కోట్ల అంచనా వ్యయంతో మంజూరై, గతంలో మాజీ ఎమ్మెల్యే ప్రారంభించిన ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జూబ్లీహిల్స్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జూబ్లీహిల్స్ డివిజన్ స్థానిక నాయకులతో కలిసి తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. తహసీల్దార్ అందుబాటులో లేకపోవడంతో డిప్యూటీ తహసీల్దార్ శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెల్దండ వెంకటేష్ మాట్లాడుతూ.. జవహర్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి కేటాయించిన స్థలంపై కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో పనులు నిలిచిపోయాయని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి స్థల వివాదాన్ని పరిష్కరించి, ఆసుపత్రి నిర్మాణ పనులు వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆసుపత్రి అందుబాటులోకి వస్తే స్థానిక పేద ప్రజలకు, ముఖ్యంగా గర్భిణులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా కొత్తగా మంజూరు చేసే పింఛన్ల లబ్ధిదారుల అర్హత పరిశీలన క్షేత్రస్థాయిలో సక్రమంగా జరగడం లేదని డిప్యూటీ తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. పరిశీలనలో లోపాల కారణంగా అర్హులైన పేదలకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు వెంటనే పునఃపరిశీలన చేపట్టి, అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ డివిజన్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో గవర్నర్ భేటీ



ప్రజానావ, హైదరాబాద్ : తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా న్యూఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర హోంమంత్రిని గవర్నర్ కలిసి మాట్లాడారు.

ఏసీబీ వలలో మీర్‌చౌక్ ఇన్‌స్పెక్టర్, హోంగార్డు

- కేసు మూసివేతకు రూ.6 లక్షలు డిమాండ్
- రూ.3 లక్షలు తీసుకుంటుండగా పట్టివేత
- నాంపల్లి ప్రత్యేక కోర్టుకు నిందితులు
- లంచం అడిగితే 1064కు ఫిర్యాదు చేయాలని ఏసీబీ సూచన



ప్రజానావ, హైదరాబాద్ : అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వలలో మీర్‌చౌక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం. కొండల్‌రావు, హోంగార్డు అబిద్ అలీ చిక్కారు. ఒక కేసును మూసివేయడంతోపాటు, ఫిర్యాదుదారుడి తండ్రిపై బలవంతపు చర్యలు తీసుకోకుండా ఉండేందుకు, భవిష్యత్తులో సహకారం అందించేందుకు లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. ఏసీబీ అధికారుల వివరాల ప్రకారం.. ఇన్‌స్పెక్టర్ కొండల్‌రావు ఫిర్యాదుదారుడి నుంచి రూ.6 లక్షలు లంచంగా డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా రూ.3 లక్షలను హోంగార్డు అబిద్ అలీ ద్వారా మంగళవారం సాయంత్రం స్వీకరిస్తుండగా ఏసీబీ సిటీ రేంజ్–1 అధికారులు పట్టుకున్నారు. హోంగార్డు వద్ద నుంచి లంచం సొమ్ము రూ.3 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు తమ విధులను సక్రమంగా నిర్వహించకుండా అక్రమ ప్రయోజనం పొందేందుకు ప్రయత్నించినట్లు ఏసీబీ పేర్కొంది. ఈ కేసులో ఇద్దరినీ అరెస్టు చేసి నాంపల్లిలోని ఎస్‌పీఈ, ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయస్థానం ఎదుట హాజరుపరిచి న్యాయస్థానం ఆదేశాల మేరకు న్యాయ నిర్బంధానికి తరలించనున్నట్లు తెలిపింది. కేసు ప్రస్తుతం దర్యాప్తులో ఉందని, భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదుదారుడి వివరాలను వెల్లడించడం లేదని అధికారులు స్పష్టం చేశారు.

లంచం అడిగితే 1064కు ఫిర్యాదు చేయండి

ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ప్రజలు ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు. తెలంగాణ ఏసీబీని వాట్సాప్ నంబర్ 9440446106, ఫేస్‌బుక్‌లో తెలంగాణ ఏసీబీ ఖాతా, ఎక్స్ వేదిక ద్వారా కూడా సంప్రదించవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

తల్లిని కోల్పోయిన చిన్నారికి ఆర్థిక సాయం

రూ.11 వేల అందజేత

ప్రజానావ, భైంసా : తల్లిని కోల్పోయి కష్టాల్లో ఉన్న చిన్నారికి భైంసా మున్సిపల్ చైర్మన్ తూమొల్ల దత్తాత్రి రూ.11 వేల ఆర్థిక సాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. తల్లిని కోల్పోయిన బిడ్డకు అండగా నిలవాలనే ఉద్దేశంతో తనవంతు సహాయంగా ఈ మొత్తాన్ని అందజేశారు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం, నిరుపేదలకు సహాయం చేయడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. చిన్నారికి ఆర్థిక సాయంతోపాటు భవిష్యత్తులో విద్యాభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.



అర్ధరాత్రి తుపాను ప్రభావంతో పలు రైళ్లు రద్దు

హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచి బయల్దేరే గోదావరి, ఫలక్‌నుమా సహా పలు రైళ్లకు అంతరాయం

ప్రజానావ, హైదరాబాద్ : అర్ధరాత్రి తుపాను నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే పలు ప్రధాన రైళ్లను రద్దు చేసింది. హైదరాబాద్, సికింద్రాబాద్, లింగంపల్లి నుంచి బయల్దేరే గోదావరి, ఫలక్‌నుమా, గరీబ్‌రథ్, విశాఖ, నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌లతోపాటు మరికొన్ని రైళ్ల రాకపోకలను నిలిపివేసినట్లు దక్షిణ మధ్య రైల్వే ముఖ్య ప్రజాసంబంధాల అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. నాగర్‌సోల్–నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌ను పాక్షికంగా రద్దు చేసినట్లు వెల్లడించారు. అలాగే శ్రీకాకుళం రోడ్డు నుంచి చర్లపల్లికి వచ్చే రైలును కూడా రద్దు చేసినట్లు పేర్కొన్నారు. తుపాను ప్రభావంతో రైళ్ల రాకపోకల్లో మార్పులు చోటుచేసుకున్న నేపథ్యంలో ప్రయాణికులు తమ ప్రయాణానికి ముందు రైళ్ల ప్రస్తుత స్థితిని పరిశీలించుకోవాలని సూచించారు.

మాదకద్రవ్యాలపై సమరభేరి

- ఓయూలో భారీ ర్యాలీ
- నషా ముక్త్ భారత్ కార్యక్రమానికి గవర్నర్ శివప్రతాప్ శుక్లా హాజరు
- రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో అవగాహన కార్యక్రమాలు
- 'పంచ పరివర్తన్' పుస్తకాన్ని ఆవిష్కరించనున్న గవర్నర్

ప్రజానావ, హైదరాబాద్ : యువతను మాదక ద్రవ్యాల బారిన పడకుండా చైతన్యపరిచి, మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో బుధవారం నషా ముక్త్ భారత్ అవగాహన కార్యక్రమం, భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు రాగూర్ ఆడిటోరియంలో ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా నషా ముక్త్ భారత్‌కు సంబంధించిన పోస్టర్లు, స్టిక్కర్లను గవర్నర్ ఆవిష్కరించడంతోపాటు విద్యార్థులు, యువతతో మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించనున్నారు. అనంతరం ఓయూ విద్యార్థులు, జాతీయ సేవా పథకం వాలంటీర్లు, భారత రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు, యువతను ఉద్దేశించి సందేశం ఇవ్వనున్నారు. రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి, రక్తదాతలకు పండ్లు, ధ్రువపత్రాలను అందజేయను న్నారు. కార్యక్రమంలో భాగంగా 1,200 మందికి పైగా ఓయూ విద్యార్థులు, జాతీయ సేవా పథకం వాలంటీర్లు, రెడ్‌క్రాస్ సభ్యులు పాల్గొనే భారీ ర్యాలీని గవర్నర్ జెండా ఊపి ప్రారంభిస్తారు. రాగూర్ ఆడిటోరియం నుంచి ఆర్ట్స్ కళాశాల వరకు సాగే ఈ ర్యాలీ ద్వారా మాదకద్రవ్యాల దుష్ప్రభావా లపై యువతలో అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ కుమార్ మొలుగరం, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, భారత రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ చైర్మన్ ఎం.దానకిశోర్ పాల్గొననున్నారు. ఇదే సమయంలో తెలంగాణలోని 33 జిల్లాల్లోనూ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ చైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అన్ని జిల్లాల్లో అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు, పోస్టర్లు, స్టిక్కర్ల ఆవిష్కరణలు, మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞలు ఏకకాలంలో చేపట్టనున్నారు.

'పంచ పరివర్తన్' పుస్తకావిష్కరణ

విద్యార్థుల్లో దేశభక్తి, నైతిక విలువలు, దేశం పట్ల బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలనే స్ఫూర్తిని పెంపొందించే లక్ష్యంతో రూపొందించిన 'పంచ పరివర్తన్' పుస్తకాన్ని కూడా గవర్నర్ శివప్రతాప్ శుక్లా బుధవారం ఆవిష్కరించనున్నారు. లోక్‌భవన్ రోడ్డులోని సంస్కృతి కమ్యూనిటీ భవన్‌లో నైతిక, సాంస్కృతిక శిక్షణ కోసం ఏర్పాటు చేసిన ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాయంత్రం 4 గంటలకు ఈ కార్యక్రమం జరగనుంది. కుటుంబ విలువలు, పర్యావరణ పరిరక్షణ, సామాజిక సమరసత, స్వదేశీ భావన, పౌర విలువలు అనే ఐదు ప్రధాన అంశాలతో ఈ పుస్తకాన్ని రూపొందించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, ఐఏఎస్, ఐఎన్‌సీటీఏఫ్ జాతీయ ఆర్గనైజింగ్ కార్యదర్శి గుణవంత్ సింగ్ కొఠారి, ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య, ఐఎన్‌సీటీఏఫ్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రామ్మూర్తితోపాటు ఇతర సభ్యులు హాజరుకానున్నారు. నగరంలోని సుమారు 300 పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాళ్లు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.



గ్రేటర్ హైదరాబాద్‌ను వణికిస్తున్న చలి

- పటాన్‌చెరులో 13 డిగ్రీలకు పడిపోయిన కనిష్ఠ ఉష్ణోగ్రత
- సాధారణం కంటే 5.3 డిగ్రీలు తక్కువ నమోదు

ప్రజానావ, హైదరాబాద్ : నగరాన్ని చలి క్రమంగా కమ్మేస్తోంది. పగటి వేళ ఎండ తీవ్రత కొనసాగుతున్నప్పటికీ, సాయంత్రం ఏడు గంటలు దాటిన తర్వాత చలిగాలుల ప్రభావం పెరుగుతోంది. భారత వాతావరణ శాఖ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం నగరంలోని పలు ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువగా రాత్రి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ముఖ్యంగా శివారు ప్రాంతాలు, ఐటీ కారిడార్ పరిసరాల్లో చలి తీవ్రత కనిపిస్తోంది. పటాన్‌చెరులో కనిష్ఠ ఉష్ణోగ్రత 13 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయింది. ఇది అక్కడి సాధారణ ఉష్ణోగ్రత కంటే 5.3 డిగ్రీలు తక్కువ కావడం గమనార్హం. రాజేంద్రనగర్‌లోనూ చలి ప్రభావం అధికంగా ఉంది. ఇక్కడ 15 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదవగా, ఇది సాధారణం కంటే 3.6 డిగ్రీలు తక్కువ. మరోవైపు హైదరాబాద్ ప్రధాన ప్రాంతంలో 19.6 డిగ్రీలు, హకీంపేటలో 19.5 డిగ్రీలు, దుండిగల్‌లో 18 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హయత్‌నగర్‌లో మాత్రం భిన్నమైన పరిస్థితి కనిపించింది. ఇక్కడ కనిష్ఠ ఉష్ణోగ్రత 22 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఇది సాధారణం కంటే 4 డిగ్రీలు ఎక్కువ కావడం విశేషం. నగరంలోని ప్రాంతాల మధ్య రాత్రి ఉష్ణోగ్రతల్లో స్పష్టమైన వ్యత్యాసం కనిపిస్తుండటంతో చలిగాలుల ప్రభావం శివారు ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటోంది.

నీటి వృథాపై నిఘా ప్రత్యేక యాప్‌తో జరిమానాలు

ఫొటో, ప్రాంతం వివరాలతో ఫిర్యాదు చేసే అవకాశం

ప్రజానావ, హైదరాబాద్ : మహానగరంలో తాగునీటి వృథాను అరికట్టేందుకు జలమండలి ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకురావడానికి సిద్ధమవుతోంది. తాగునీటిని ఇతర అవసరాలకు వినియోగించడం, శుద్ధి చేసిన జలాలను దుర్వినియోగం చేయడాన్ని అడ్డుకునేలా కార్యాచరణ రూపొందిస్తోంది. నీటి వృథాపై ప్రజలు ఫిర్యాదు చేసేందుకు వీలుగా ఈ యాప్‌ను తీసుకురానుంది. యాప్‌లో నీటి వృథాకు సంబంధించిన ఫొటోలు, ప్రాంత వివరాలను అప్‌లోడ్ చేస్తే జలమండలి అధికారులు వాటిని పరిశీలించి బాధ్యులకు జరిమానా విధిస్తారు. ఈ జరిమానాను నీటి బిల్లుతోపాటు చెల్లించాల్సి ఉంటుంది. ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి తెలిపారు.

ప్యారడైజ్ హోటల్‌కు రూ.20 వేల జరిమానా

తాగునీటిని దుర్వినియోగం చేసినందుకు ప్యారడైజ్ హోటల్‌కు రూ.20 వేల జరిమానా విధించినట్లు జలమండలి ప్రకటించింది. భవిష్యత్తులోనూ నీటి దుర్వినియోగం పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. తాగునీటిని బాధ్యతాయుతంగా వినియోగిస్తూ వృథాను అరికట్టేందుకు ప్రజలు సహకరించాలని జలమండలి సూచించింది.



సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

- విశాఖకు చెందిన రాజేశ్‌గా గుర్తింపు
- మృతదేహం కోసం గాలింపు

ప్రజానావ, హైదరాబాద్ : దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జిపై నుంచి దూకి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడిని విశాఖపట్నానికి చెందిన రాజేశ్ (25)గా పోలీసులు గుర్తించారు. మాదాపూర్ పోలీసుల వివరాల ప్రకారం.. రాజేశ్ నానాచారంలోని ఓ వసతి గృహంలో ఉంటున్నాడు. సోమవారం మాదాపూర్ అయ్యప్ప సొసైటీలోని తన స్నేహితులను కలిసేందుకు వచ్చాడు. అనంతరం దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి వద్దకు వెళ్లి చెరువులోకి దూకాడు. సమాచారం అందుకున్న పోలీసులు, సహాయక బృందాలు మృతదేహం కోసం గాలింపు చేపట్టాయి. జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డీఆర్ఎఫ్), విపత్తు స్పందన దళం (డీఆర్ఎఫ్) సిబ్బంది చెరువులో వెతుకుతున్నారు. రాజేశ్ సోదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అతడు ఆత్మహత్యకు పాల్పడటానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

పోలీసు అమరవీరుల స్మరణలో భారీ బైక్ ర్యాలీ

- ఖానాపూర్‌లో ర్యాలీ ప్రారంభించిన సీఐ సత్యనారాయణ
- హెల్మెట్ ధారణ, రహదారి భద్రతపై అవగాహన

ప్రజానావ, నిర్మల్ : శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పోలీసు ఫ్లాగ్ డే వారోత్సవాల్లో భాగంగా ఖానాపూర్ పోలీస్‌స్టేషన్ నుంచి కొమురం భీం చౌరస్తా వరకు సాగిన ఈ ర్యాలీని ఖానాపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ జెండా ఊపి ప్రారంభించారు. ప్రతి సంవత్సరం అక్టోబరు 21 నుంచి 31 వరకు నిర్వహించే పోలీసు ఫ్లాగ్ డే వారోత్సవాల్లో భాగంగా 'నిర్మల్ పోలీస్.. మీ పోలీస్' నినాదంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. విధి నిర్వహణలో పోలీసులు చేసే త్యాగాలను ప్రజలకు తెలియజేయడంతోపాటు, ప్రజల రక్షణ కోసం పోలీసు శాఖ అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. ప్రజలకు, పోలీసులకు మధ్య సత్సంబంధాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ర్యాలీ నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. రహదారి భద్రతపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు ర్యాలీలో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా



హెల్మెట్లు ధరించి ద్విచక్ర వాహనాలు నడిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఖానాపూర్ సీఐ సత్యనారాయణతోపాటు ఎస్ఐలు రాహుల్, సాయికుమార్, సాయికిరణ్, హనుమాండ్లు, ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ పోలీస్‌స్టేషన్ల సిబ్బంది, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సాత్నాల ఆయకట్టుకు సాగునీటి విడుదల

- 28 వేల నుంచి 30 వేల ఎకరాలకు నీరందించేలా ప్రణాళిక
- పొదుపుగా వినియోగించుకోవాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ సూచన

ప్రజానావ, ఆదిలాబాద్ : సాత్నాల ప్రాజెక్టు కాలువల ద్వారా పంటల సాగుకు ఎమ్మెల్యే పాయల్ శంకర్ మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించి సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాత్నాల ప్రాజెక్టు పరిధిలోని సుమారు 28 వేల నుంచి 30 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు, కరువు పరిస్థితులు నెలకొన్నప్పటికీ ప్రాజెక్టులో నీటి నిల్వలు అందుబాటులో ఉండటం రైతులకు కలిసొచ్చే అంశమని పేర్కొన్నారు. మొత్తం 35 రోజుల ప్రణాళికతో మూడు విడతల్లో సాగునీటిని విడుదల చేయనున్నట్లు వివరించారు. రాబోయే వేసవిలో తాగునీటి అవసరాలను తీర్చేందుకు కూడా



ప్రాజెక్టులో కొంత నీటిని నిల్వ ఉంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. రైతులు సాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా, సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. అందుబాటులో ఉన్న నీటిని ప్రణాళికాబద్ధంగా వినియోగించుకుంటూ పంటలకు సకాలంలో నీరందేలా సహకరించాలని ఎమ్మెల్యే కోరారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై నేతల చర్చలు

ఆయిల్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డితో కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి భేటీ

ప్రజానావ, హనుమకొండ : తెలంగాణ రాష్ట్ర ఆయిల్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డితో ఉమ్మడి నల్లగొండ–ఖమ్మం–వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. హనుమకొండలోని టేకులగూడెం గెస్ట్‌హౌస్‌లో జంగా రాఘవరెడ్డి నివాసంలో జరిగిన ఈ సమావేశంలో రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. ఎన్నికల్లో పార్టీ తరఫున చేపట్టాల్సిన కార్యక్రమాలు, ప్రచార నిర్వహణ, పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియ, క్షేత్రస్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం తదితర అంశాలపై ఇరువురు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.





ఇంద్రవెల్లి సభను విజయవంతం చేయాలి

- ఈ నెల 30న పాంచజన్య సంకల్ప సభ
- పోస్టర్లు ఆవిష్కరించిన మాజీ మంత్రి బోడ జనార్ధన్

ప్రజానావ, నిర్మల్ : తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో ఇంద్రవెల్లిలో నిర్వహించనున్న పాంచ జన్య సంకల్ప సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి బోడ జనార్ధన్ పిలుపునిచ్చారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ రక్షణ సేన నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జి చంద్రప్రకాశ్‌తో కలిసి సభకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బోడ జనార్ధన్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజలను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనూ ప్రజాధనాన్ని దోచుకుంటూ పాలన సాగించారని విమర్శించారు. గతంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంద్రవెల్లిలో సభ నిర్వహించి ప్రజలకు అనేక హామీలు ఇచ్చారని గుర్తుచేశారు. అయితే ఆ హామీలను అమలు చేయకపోవడంతో, హామీలు ఇచ్చిన అదే సభా ప్రాంగణం నుంచే ముఖ్యమంత్రిని ప్రశ్నించేందుకు ఈ నెల 30న పాంచజన్య సంకల్ప సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుమారు 30 వేల మందితో సభను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు.

నీటి లభ్యతకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలి

ప్రజానావ, మహబూబాబాద్ : ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని రైతులు పంటల ఎంపికలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ, సంబంధిత శాఖల అధికారులు సూచించారు. సీరోలు మండలం కాంపల్లి రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన 'ఖేత్ బచావో అభియాన్' కార్యక్రమంలో రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా, సమర్థవం తంగా వినియోగించుకోవాలని, తక్కువ నీటితో పంటకాలాన్ని పూర్తి చేసుకునే పంటలను సాగు చేయడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించుకోవచ్చని తెలిపారు. పంటల వైవిధ్యంలో భాగంగా పెసర, మినుము, నువ్వులు, పొద్దుతిరుగుడు, కుసుమతోపాటు కూరగాయలు, దోసకాయ, కీర వంటి పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవడంతోపాటు నీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవడం ద్వారా సాగులో నష్టాలను తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఛాయారాజ్, వ్యవసాయ విస్తరణ అధికారులు ఎం.భరత్, జి.నురేష్, నీటిపారుదల శాఖ ఏఈ నిఖిలేందర్, విద్యుత్ శాఖ లైన్‌మెన్, నాయక్‌తండా, బిల్యా నాయక్‌తండా, కాంపల్లి, రేకులతండా గ్రామాల సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.



ఖమ్మం స్టేడియంలో ఖేలో ఇండియా విలువిద్య పోటీలు

- డిసెంబర్ 11 నుంచి 24 వరకు యూత్ గేమ్స్
- వసతి, మైదానాల అభివృద్ధికి ఏర్పాట్లు

ప్రజానావ, ఖమ్మం : ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణకు ఖమ్మం సిద్ధమవుతోంది. డిసెంబరులో జరగనున్న ఈ క్రీడా సంబరాల్లో భాగంగా విలువిద్య పోటీలను ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించనున్నారు. పోటీలు ప్రారంభమయ్యేలోగా అవసరమైన పనులను దశలవారీగా పూర్తి చేసి మైదానాన్ని సిద్ధం చేసేందుకు అధికారులు కార్యాచరణ రూపొందించారు. సుమారు 15 ఎకరాల్లో విస్తరించిన స్టేడియంలో వివిధ ప్రాంగణాలు, అందుబాటులో ఉన్న సదుపాయాలు, చేపట్టాల్సిన మార్పులు, చేర్పులపై సమగ్రంగా పరిశీలించి సమగ్ర ప్రాజెక్టు నివేదికను సిద్ధం చేశారు. ముఖ్యంగా వసతి, మరుగుదొడ్ల ఏర్పాట్లపై కసరత్తు పూర్తి చేశారు. క్రీడాకారులు, సిబ్బంది రాకపోకలకు ఇబ్బందులు లేకుండా పార్కింగ్ స్థలాన్ని విస్తరించేందుకు అడ్డుగా ఉన్న వ్యర్థాలను తొలగించే పనులు ఇప్పటికే ప్రారంభించారు. పోటీలకు సుమారు 200 మంది క్రీడాకారులతోపాటు 250 మంది నిర్వాహకులు, సాంకేతిక సిబ్బంది, పర్యవేక్షక అధికారులు రానున్న నేపథ్యంలో వారికి స్థానిక హోటళ్లలో వసతి కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. స్టేడియంలో చేపట్టే అభివృద్ధి పనులు, నిర్మాణాలు మినహా ఇతర ఏర్పాట్లను టెండర్ల ద్వారా అప్పగించాలని అధికారులు నిర్ణయించారు. మరోవైపు పోటీల నిర్వహణలో భాగస్వాములయ్యే వాలంటీర్ల ఎంపిక ప్రక్రియను కూడా ప్రారంభించారు. సర్దార్ పటేల్ స్టేడియంతోపాటు సమీపంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాల మైదానాన్ని కూడా పోటీల నిర్వహణకు వినియోగించనున్నారు. ఏర్పాట్ల కోసం నవంబరు 9 నుంచి 24 వరకు కళాశాల మైదానాన్ని అందుబాటులో ఉంచాలని జిల్లా యువజన, క్రీడలశాఖ అధికారులు కళాశాల యాజమాన్యాన్ని కోరారు. జాతీయస్థాయి క్రీడాకారుల సాధన కోసం ఈ మైదానాన్ని ఎంపిక చేశారు. వారు సాధన చేసే విధానాన్ని స్థానిక క్రీడాకారులు వీక్షించేలా ఏర్పాట్లు చేయనున్నారు. ప్రధాన పోటీల నిర్వహణ కోసం పటేల్ స్టేడియాన్ని తీర్చిదిద్దడంతోపాటు అక్కడి ప్రధాన భవనాన్ని ఆధునీకరించేందుకు అవసరమైన ప్రణాళికను సిద్ధం చేశారు. యూత్ గేమ్స్ డిసెంబరు 11 నుంచి 24 వరకు కొనసాగనున్నప్పటికీ, విలువిద్య పోటీలను రెండు, మూడు రోజుల వ్యవధిలోనే పూర్తి చేయనున్నారు. నిర్దిత గడువులోగా అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి పోటీలను సజావుగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

- పొలంలో మోటారు ఆన్ చేస్తుండగా ప్రమాదం
- పరిధిపురంలో విషాదం



ప్రజానావ, గద్వాల : పొలంలో విద్యుత్ మోటారు ఆన్ చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై 17 ఏళ్ల యువకుడు మృతి చెందిన విషాద ఘటన జోగులాంబ గద్వాల జిల్లాలో చోటుచేసుకుంది. అయిజ మండలం పరిధిపురం గ్రామానికి చెందిన ఉపేందర్ గౌడ్ పొలంలో మోటారు ఆన్ చేసే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. చిన్న వయసులోనే యువకుడు మృతి చెందడంతో పరిధిపురం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

తాగునీటి వనరులపై నిర్లక్ష్యం

- చేతిపంపులు పనిచేయకున్నా పట్టించుకోని అధికారులు
- కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు
- సింగిల్‌ఫేజ్ మోటార్లతో విద్యుత్తు, నీటి వృథా



ప్రజానావ, మహబూబ్‌నగర్ : ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో తాగునీటి ఎద్దడి తలెత్తే ప్రమాదం ఉందని, ముందస్తు చర్యలు చేపట్టి గ్రామాలు, పట్టణాల్లో జలవనరులను సిద్ధం చేయాలని కలెక్టర్ ఖుష్బూగుప్తా అధికారులను ఆదేశించారు. చేతిపంపులు, గ్రామపంచాయతీ బోర్లకు మరమ్మతులు చేసి ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితుల్లో మార్పు కనిపించడం లేదని, పలు మండలాల్లో చేతిపంపులు పనిచేయకపోయినా అధికారులు పట్టించుకోవడం లేదని పరిశీలనలో వెల్లడైంది. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన సమయంలో తాగునీటి వనరుల నిర్వహణపై నిర్లక్ష్యం కనిపిస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సింగిల్‌ఫేజ్ మోటార్లతో వృథా

మహమ్మదాబాద్ మండలంలో చేతిపంపుల వినియోగం తగ్గిపోయింది. వాటి స్థానంలో సింగిల్‌ఫేజ్ మోటార్లను బిగించి తాగునీటిని తోడుకుంటున్నారు. చాలా గ్రామాల్లో అవసరం లేకపోయినా మోటార్లను నడుపుతుండటంతో విద్యుత్తుతో పాటు నీరు కూడా వృథా అవుతోంది. మండలంలో ప్రజల తాగునీటి అవసరాల కోసం 186 సింగిల్‌ఫేజ్ మోటార్లు, 26 త్రీఫేజ్ మోటార్లు వినియోగంలో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యత తగ్గే అవకాశాలున్న నేపథ్యంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న వనరులను పొదుపుగా వినియోగించడంతో పాటు పనిచేయని చేతిపంపులు, బోర్లకు తక్షణమే మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది. కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి తాగునీటి వనరుల స్థితిగతులను పరిశీలించి, ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

డైనేజీ నిర్మాణ పనులకు భూమిపూజ

రూ.3 లక్షల ఆర్థిక సంఘం నిధులతో పనులు ప్రారంభం

ప్రజానావ, పాన్‌గల్ : మండల కేంద్రంలోని రాజీవ్‌నగర్ కాలనీలో డ్రైనేజీ నిర్మాణ పనులకు సర్పంచ్ నాగలక్ష్మి మంగళవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దీర్ఘకాలంగా కాలనీవాసులు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యకు ఈ పనులతో పరిష్కారం లభించనుందని తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.3 లక్షలతో నిర్మాణ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అరుణ, మాజీ సర్పంచ్ హైమావతి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలపై కోతుల దండయాత్ర

- ప్రజలకు కంటి మీద కునుకు కరువు
- పిల్లలు, వృద్ధులు, మహిళలపై దాడులు
- పంటలకు తీవ్ర నష్టం
- టీకాల కోసం ఆస్పత్రులకు పరుగులు
- నియంత్రణ చర్యలు చేపట్టాలని ప్రజల డిమాండ్



ప్రజానావ, యాదాద్రి భువనగిరి : జిల్లాలోని పలు మండలాల్లో కోతుల బెడద రోజురోజుకూ పెరుగుతోంది. నివారణ చర్యలు లేక గ్రామాలపై గుంపులుగా విరుచుకుపడుతున్న కోతులు ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలపై దాడులు చేస్తూ గాయపరుస్తుండగా, పంట పొలాలను ధ్వంసం చేస్తూ రైతులకు నష్టాలు మిగులుస్తున్నాయి. ఆత్మకూరు(ఎం) మండలంలోని 23 గ్రామపంచాయతీల్లో వందల సంఖ్యలో కోతులు సంచరిస్తున్నా నియంత్రణ చర్యలు చేపట్టడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూరెళ్ల గ్రామంలో గత సెప్టెంబరులో గ్రామస్థులు, మాజీ సర్పంచి బి.ఉప్పలయ్య విరాళాలతో సుమారు 200 కోతులను పట్టించి నల్లమల అడవిలో వదిలిపెట్టారు. అయితే చుట్టుపక్కల గ్రామాల నుంచి మళ్లీ కోతులు రావడంతో సమస్య మొదటికొచ్చింది. ఈ నేపథ్యంలో 2025 జనవరి నుంచి ఇప్పటివరకు సుమారు 400 మంది కోతికాటుకు గురై టీకాలు తీసుకున్నారు. గ్రామాల్లో కోతుల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో అశించిన చర్యలు కనిపించడం లేదని ప్రజలు అంటున్నారు. వందల సంఖ్యలో గుంపులుగా సంచరిస్తూ దాడులకు దిగుతుండటంతో రైతులు కూరగాయలు, వేరుశనగ, పప్పుధాన్యాలు, పండ్ల తోటల సాగును తగ్గించుకోవడం లేదా మానుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆలేరు మండలంలో 19 గ్రామాలు ఉండగా, 12,631 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ ప్రాంతంలో రెండు వేలకు పైగా కోతులు సంచరిస్తూ పత్తి, వరి పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడంతో పాటు ప్రజలపై దాడులకు పాల్పడుతున్నాయి. గత ఏడాది కాలంలోనే 300 మందికి పైగా కోతుల దాడుల్లో గాయపడినట్లు సమాచారం. తుర్కపల్లి మండలంలో పెంకుటిళ్లు, రేకుల ఇళ్లు, హోటళ్లు, బేకరీలు, కూరగాయలు, పండ్ల దుకాణాలపై కోతులు దాడులకు దిగుతున్నాయి. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థుల చేతుల్లోని అన్నం ప్లేట్లను సైతం లాక్కెళ్తున్నాయి. దత్తాయిపల్లి, గుజ్జవానికుంట గ్రామాల్లో ఎలుగుబంటి వేషధారణతో కోతులను భయపెట్టే ప్రయత్నాలు చేసినా ఫలితం లేకుండా పోయింది. జనవరి నుంచి ఇప్పటివరకు ఈ మండలంలో 301 మందిని కోతులు గాయపరిచాయి. బొమ్మలరామారం మండలంలో ఇదే కాలంలో 71 మంది, గుండాల మండలంలో గత నాలుగు నెలల్లో 74 మంది కోతుల దాడులకు గురయ్యారు. వీరంతా చికిత్స, టీకాల కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. కోతుల బెడదతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలన్నా భయపడాల్సిన పరిస్థితి నెలకొందని, రైతులు పంటల సాగుకు వెనుకంజ వేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. కోతుల సంఖ్యను నియంత్రించేందుకు సంతాన నియంత్రణ చర్యలు చేపట్టడంతో పాటు, ప్రజలకు రక్షణ కల్పించేలా ప్రభుత్వం, సంబంధిత అధికారులు తక్షణమే సమగ్ర కార్యాచరణ రూపొందించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



సారపాకలో పోలీసుల నిర్బంధ తనిఖీలు

- అనుమానితుల వివరాల సేకరణ
- పత్రాలు లేని వాహనాలు స్వాధీనం

ప్రజానావ, బూర్గంపాడు : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలోని సారపాక పారిశ్రామిక ప్రాంతంలో పాల్వంచ డీఎస్పీ సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం పోలీసులు నిర్బంధ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త వ్యక్తులు, అనుమానితుల వివరాలను సేకరించడంతోపాటు సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ప్రాంతంలో శాంతి భద్రతలను కాపాడటంతోపాటు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని, ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ సతీశ్‌కుమార్ హెచ్చరించారు. ఈ తనిఖీల్లో సీఐ సతీశ్, ఎస్సైలు ప్రసాద్, నాగభిక్షం, రామమూర్తితోపాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కజొన్నకు రికార్డు ధర

- రైతుల్లో ఆనందం
- క్వింటాలుకు రూ.2,800 పలుకుతున్న ధర
- మద్దతు ధర కంటే అధికంగా కొనుగోలు చేస్తున్న వ్యాపారులు



ప్రజానావ, మెదక్ : మొక్కజొన్న సాగు చేసిన రైతుల కళ్లలో ఆనందం కనిపిస్తోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి మక్కలకు రికార్డు స్థాయిలో ధర పలుకుతుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధర కంటే అధికంగా వ్యాపారులు కొనుగోలు చేస్తుండటంతో రైతుల వద్దకే వచ్చి పంటను సేకరిస్తున్నారు. జిల్లాలో వరి, పత్తి తర్వాత మొక్కజొన్నను ఎక్కువగా సాగు చేస్తారు. ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా 4,542 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేయగా, చేగుంట, నిజాంపేట, రామాయంపేట, చిన్నశంకరంపేట, శివ్వంపేట, వెల్దుర్తి తదితర మండలాల్లో అధిక విస్తీర్ణంలో పంట వేశారు. ప్రస్తుతం క్వింటాలు మక్కల ధర రూ.2,800 కు చేరింది. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ.2,410 ఉండగా, ప్రైవేటు వ్యాపారులు అంతకంటే ఎక్కువ చెల్లిస్తూ నేరుగా రైతుల వద్దే కొనుగోలు చేస్తున్నారు. గతంలో ధర పెంచాలని రైతులే వ్యాపారులను వేడుకునే పరిస్థితి ఉండగా, ప్రస్తుతం వ్యాపారులే రైతుల వద్దకు వెళ్లి మక్కలను తూకం వేసి తీసుకెళ్తున్నారు. పదిహేను రోజుల క్రితం క్వింటాలు ధర రూ.2,600 ఉండగా, వారం రోజుల్లోనే మరో రూ.200 పెరగడం గమనార్హం.

పౌల్ట్రీ పరిశ్రమల నుంచి పెరిగిన డిమాండ్

కోళ్ల దాణా తయారీలో మొక్కజొన్నను అధికంగా వినియోగిస్తారు. ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో మక్కల లభ్యత తగ్గవచ్చనే అంచనాలతో కోళ్ల దాణా పరిశ్రమల యాజమాన్యాలు ధర ఎక్కువైనా కొనుగోలు చేసేందుకు ముందుకొస్తున్నాయి. జిల్లాలో చేగుంట, మాసాయిపేట, శభాష్‌పల్లిలో ఉన్న కోళ్ల దాణా పరిశ్రమల యాజమాన్యాలు వ్యాపారుల ద్వారా అందుబాటులో ఉన్న మక్కలను సేకరిస్తున్నాయి. దీంతో రైతుల వద్ద మొక్కజొన్నలు ఉన్నాయనే సమాచారం అందితే చాలు ప్రైవేటు వ్యాపారులు అక్కడికి చేరుకుని కొనుగోలు చేస్తున్నారు. పంట విక్రయించిన రెండు మూడు రోజుల్లోనే డబ్బులు చెల్లిస్తుండటంతో రైతులకు వెసులుబాటు కలుగుతోంది. గతంలో ఎన్నడూ మక్కలకు ఇంత ధర లభించలేదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎల్‌నినో దెబ్బకు సీతాఫలాల దిగుబడి డీలా!

- వర్షాభావంతో తగ్గిన ఫలసాయం
- కూలీలు, గుత్తేదారులు, వ్యాపారులకు నష్టాలు
- రూ.10 కోట్ల వ్యాపారానికి గండి
- ఉపాధి కోల్పోయిన వందలాది కుటుంబాలు



ప్రజానావ, మహబూబ్‌నగర్ : ప్రకృతిలో సహజంగా లభించే సీతాఫలాలకు పాలమూరు ప్రాంతంలో మంచి గిరాకీ ఉంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అడవుల్లో విరివిగా పెరిగే సీతాఫలాల సేకరణ ద్వారా గిరిజన తండాలు, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఏటా రెండు, మూడు నెలల పాటు ఉపాధి లభించేది. వ్యాపారులు సైతం పెద్ద ఎత్తున కొనుగోళ్లు జరిపి ఇతర ప్రాంతాలకు తరలించేవారు. అయితే ఈసారి ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సరిగా కురవక దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. దీంతో సీతాఫలాల సేకరణపై ఆధారపడిన కూలీలకు ఉపాధి కరువవగా, గుత్తేదారులు, వ్యాపారులకూ నష్టాలు తప్పదం లేదు. మహబూబ్‌నగర్, నారాయణపేట, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని అడవుల్లో లభించే సీతాఫలాలను స్థానికులు సేకరించి గుత్తేదారులకు విక్రయిస్తుంటారు. వీరు వాటిని గుంటూరు, విజయవాడ, కాకినాడ, కర్నూలుతో పాటు కర్ణాటకలోని రాయచూరు తదితర ప్రాంతాలకు తరలిస్తారు. ఈ వ్యాపారం ద్వారా ఏటా రూ.10 కోట్లకు పైగా లావాదేవీలు జరుగుతున్నట్లు అంచనా. గతంలో ఉమ్మడి జిల్లాలో రోజుకు సుమారు 50 టన్నుల సీతాఫలాలను సేకరించేవారు. మూడు నెలల సీజన్‌లో దాదాపు 60 రోజుల పాటు ఈ స్థాయిలో సేకరణ జరిగితే మొత్తం 3 వేల టన్నుల వరకు దిగుబడి వచ్చేది. కానీ ఈసారి వర్షాభావ పరిస్థితుల కారణంగా వెయ్యి టన్నుల దిగుబడి కూడా రాలేదని వ్యాపారులు చెబుతున్నారు.

కూలీలకు నిరాశే

ప్రతి జిల్లాలో వందలాది కుటుంబాలకు సీతాఫలాల సేకరణ జీవనాధారంగా ఉండేది. రోజుకు రూ.300 నుంచి రూ.400 వరకు సంపాదించేవారు. సీజన్ మొత్తం మీద ఒక్కో కూలీకి రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు ఆదాయం లభించేది. ఈసారి నెల రోజులు కూడా సీజన్ కొనసాగకపోవడంతో ఆశించిన ఆదాయం రాక కుటుంబ పోషణ కష్టంగా మారిందని కూలీలు వాపోతున్నారు.

గుత్తేదారులకూ నష్టాలే

అడవుల్లో సీతాఫలాల సేకరణ హక్కుల కోసం అటవీశాఖ ఆధ్వర్యంలో ఏటా వేలం నిర్వహిస్తున్నారు. మహబూబ్‌నగర్ పరిధిలో రూ.14 లక్షలు, మహమ్మదాబాద్‌లో రూ.8.05 లక్షలు, నవాబ్‌పేటలో రూ.5.41 లక్షలకు గుత్తేదారులు హక్కులు దక్కించుకున్నారు. అయితే ఈసారి దిగుబడి తగ్గిపోవడంతో పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు లేకపోవడంతో సేకరణ పనులు తగ్గి కూలీలు, గుత్తేదారులు, వ్యాపారులు ఆర్థికంగా నష్టపోతున్నారు.

గుజ్జు కేంద్రాల్లోనూ పనులు కరువు

నవాబ్‌పేట మండలం పోమాల్, దామరగిద్ద మండలం క్యాతన్‌పల్లిలో సీతాఫలాల గుజ్జు తయారీ కేంద్రాలు ఉన్నాయి. సాధారణంగా సీజన్‌లో ఈ కేంద్రాల్లో పెద్దఎత్తున పనులు జరిగి మహిళలకు ఉపాధి లభించేది. ఈసారి సీతాఫలాల రాక తగ్గడంతో పనిదినాలు గణనీయంగా తగ్గి మహిళా కార్మికులకు ఉపాధి లేకుండా పోయింది. క్యాతన్‌పల్లికి గత ఏడాది 42 టన్నుల సీతాఫలాలు రాగా, ఈసారి ఐదు టన్నులు కూడా రాలేదని కేంద్రం నిర్వాహకులు చెబుతున్నారు. దిగుబడి తగ్గడంతో సీతాఫలాల వ్యాపారంపై ఆధారపడిన అన్ని వర్గాలకూ ఈ సీజన్ నిరాశనే మిగిల్చింది.



జాతీయ క్రికెట్‌కు కినీషా ఎంపిక

వనపర్తి యువ క్రీడాకారిణికి నిరంజన్‌రెడ్డి సన్మానం

ప్రజానావ, వనపర్తి : జమ్మూకశ్మీర్‌లో జరగనున్న జాతీయ అండర్–17 క్రికెట్ పోటీలకు భారత జట్టు తరఫున ఎంపికైన వనపర్తికి చెందిన యువ క్రీడాకారిణి అర్.కినీషాను నిరంజన్‌రెడ్డి తన స్వగృహంలో ఘనంగా సన్మానించి అభినందించారు. వనపర్తిలోని చాణక్య హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న కినీషా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమని ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి అన్నారు. తల్లిదండ్రులు చదువుతోపాటు పిల్లలకు ఆసక్తి ఉన్న క్రీడల్లోనూ ప్రోత్సాహం అందించాలని సూచించారు. సరైన ప్రోత్సాహం, శిక్షణతో క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకుని ఉన్నత స్థాయికి చేరుకోవడంతోపాటు తమ ప్రాంతానికి, దేశానికి కీర్తిప్రతిష్ఠలు తీసుకురాగలరని పేర్కొన్నారు. కినీషాకు శిక్షణ అందించిన కోచ్‌లు రాంబాబు, కృష్ణతో పాటు ఆమె తల్లిదండ్రులు కరుణశ్రీ, మహేశ్వర్‌రెడ్డిని కూడా అభినందించారు. కార్యక్రమంలో వాకిటి శ్రీధర్, బాలిశ్వర్‌రెడ్డి, చిట్యాల రాము తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

- నల్లగొండలో భారీ బైక్ ర్యాలీ
- జెండా ఊపి ప్రారంభించిన ఎస్పీ శరత్ చంద్ర పవార్



ప్రజానావ, నల్లగొండ : దేశం కోసం, ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం నల్లగొండ పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీని ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఈ ఏడాది 154 మంది పోలీసులు, తెలంగాణలో నలుగురు పోలీసులు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణతోపాటు శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు నిరంతరం విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నో సవాళ్లు, ప్రమాదాలను ఎదుర్కొంటూ ప్రజల భద్రతే లక్ష్యంగా పనిచేస్తున్న పోలీసు సిబ్బంది సేవలు అభినందనీయమన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, వారి ఆశయాలను కొనసాగిస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడమే వారికి అర్పించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. అమరవీరుల త్యాగాలను ప్రజలకు తెలియజేయడం, పోలీసుల సేవలు, విధి నిర్వహణలో వారు ఎదుర్కొనే సవాళ్లపై ప్రజల్లో అవగాహన కల్పించడమే సంస్మరణ వారోత్సవాల ముఖ్య ఉద్దేశమని వివరించారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తూ చట్టాలను గౌరవించాలని, సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ ఎన్‌జీ కళాశాల, రామగిరి, క్లాక్ టవర్ మీదుగా కొనసాగింది. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమేష్, 12వ బెటాలియన్ అదనపు కమాండెంట్ నాగేశ్వర్‌రావు, నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



బాలలపై లైంగిక నేరాల నివారణకు బాధ్యతగా వ్యవహరించాలి

- సురక్షిత్ బచ్పన్ అభియాన్ బాలలపై లైంగిక నేరాల నిరోధానికి పాఠశాలల్లో అవగాహన
- పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి
- సిరిసిల్ల మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె. సృజన

ప్రజానావ, సిరిసిల్ల : బాలలపై లైంగిక నేరాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సిరిసిల్ల మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.సృజన అన్నారు. మంగళవారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కుసుమ రామయ్య బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు పి.నీరజ సూచనలతో బాలల హక్కులపై అవగాహన పెంపొందించడం లక్ష్యంగా "సురక్షిత్ బచ్పన్ అభియాన్" పేరుతో జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న పాఠశాల స్థాయి అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పోక్సో చట్టం ప్రకారం, పిల్లలపై లైంగిక వేధింపులు లేదా అనుచిత ప్రవర్తనకు సంబంధించిన సంఘటనలు జరిగినప్పుడు వాటిని నిర్భయంగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని, బాధిత పిల్లలకు తక్షణ రక్షణ, న్యాయ సహాయం అందించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. పిల్లలపై లైంగిక నేరాలు జరిగినప్పుడు వాటిని దాచిపెట్టకుండా, చట్టప్రకారం సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని, బాధిత పిల్లల వ్యక్తిగత వివరాల గోప్యతను కాపాడుతూ వారికి మానసిక ధైర్యం, భరోసా కల్పించాలని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమంలో హెచ్ఎం ఎల్ మోతిలాల్, లోక్ అదాలత్ సభ్యులు చింతోజు భాస్కర్, న్యాయవాదులు పెంట శ్రీనివాస్, ఆడెపు వేణు, కళ్యాణి, కుంట శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సిరిసిల్లలో ముగిసిన వెంకన్న బ్రహ్మోత్సవాలు

ఘనంగా చక్ర స్నానం, మంత్ర హోమం, మహా పూర్ణాహుతి



ప్రజానావ, సిరిసిల్ల : సిరిసిల్లలో జరుగుతున్న శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం దేవాలయంలో మూర్తి మంత్ర హోమం, మహా పూర్ణాహుతి చక్రస్నానం నం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ చక్రపాణి దంపతులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ చక్రపాణి మాట్లాడుతూ ఈనెల 17 నుండి 27 వరకు శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శాస్త్రీయంగా పూజా కార్యక్రమాలను, రథోత్సవ కార్యక్రమం ఇలా ప్రతి కార్యక్రమం ను భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండ నేటి వరకు విజయవంతంగా నిర్వహించిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి అర్చకులకు దేవాలయ ఈఓ, అర్చకులకు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. అనంతరం దేవాలయం ఈవో మారుతీ రావు బ్రహ్మోత్సవాల్లో భాగంగా పూజా కార్యక్రమాలకు, యజ్ఞయాగాలకు అవసరమగు పూజా సామాగ్రిని వేద పండితులకు భోజన వసతులను సొంత ఖర్చులతో ఏర్పాటుచేసిన మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ చక్రపాణి దంపతులను సత్కరించగా చైర్ పర్సన్ దుంపతులను వేద పండితులు ఆశీర్వదించి స్వామివారి ప్రసాదాలను అందించారు. ఈ పూజకార్యక్రమములో కౌన్సిలర్లు అడిచర్ల రూప సాయి కృష్ణ దంపతులు, దార్ణం అరుణ లక్ష్మీ నారాయణ దంపతులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్, కొండ శంకర్, మామిడాల రమణ, కోడం శ్రీనివాస్ ప్రముఖులు భక్తులు పాల్గొన్నారు.

అనుబంధ ఆలయాల్లో దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ ప్రత్యేక పూజలు



ప్రజానావ, వేములవాడ: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయాలైన శ్రీ భీమేశ్వర స్వామి, శ్రీ బద్ది పోచమ్మ అమ్మవార్లను దేవాదాయ ధర్మాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ (ఎండోమెంట్ ట్రిబ్యునల్) కృష్ణవేణి మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు, వేద పండితులు ఆమెకు స్వాగతం పలికి వేదాశీర్వచనం అందజేశారు. ఆలయ ఈవో ఎల్. రమాదేవి శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో ప్రతాప నవీన్ కుమార్, ఆలయ అధికారులు, ఉద్యోగులు, అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.


ఎల్ నినో నేపథ్యంలో రైతులకు అవగాహన

రూరల్ మండల అగ్రికల్చర్ ఆఫీసర్ వినీత రెడ్డి

ప్రజానావ, వేములవాడ రూరల్ : ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో రైతులు రబీ సీజన్లో వరి పంట కాకుండా ప్రత్యామ్నాయ (ఆరుతడి) పంటలు వేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండల అగ్రికల్చర్ ఆఫీసర్ వినీత రెడ్డి కోరారు. మంగళవారం రూరల్ పరిధిలోని వట్టెంల గ్రామంలోని రైతు వేదికలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు వరి పంట వేసి ఇబ్బందులు పడవద్దు అని, నీరును తక్కువగా ఉపయోగించి సాగు చేసే పంటలను వెయ్యాలని సూచించారు. ప్రభుత్వం తరఫున అందించే సబ్సిడీలను సైతం రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎల్‌నినో ప్రభావాన్ని సమష్టిగా అధిగమిద్దాం

- వరి సాగుకు దూరంగా ఉండాలి
- ప్రత్యామ్నాయ పంటలతో రైతులు ఆదాయం పొందాలి
- నీటి వృథాను అరికట్టాలి
- కొత్త బోర్లకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి
- అధికారులతో కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష



ప్రజానావ, సిరిసిల్ల : సూపర్ ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను సమిష్టిగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని రైతులు యాసంగిలో వరి సాగు చేయకుండా ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలని పిలుపునిచ్చారు. సూపర్ ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన ప్రత్యామ్నాయ ప్రణాళికపై సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా వర్ష పాతం, రానున్న మూడు నెలల్లో వర్షాలు కురిసే అవకాశాలు, నీటిపారుదల వనరులు, వివిధ పంటల సాగు తదితర అంశాలపై అధికారులు ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ ఏడాది జిల్లాలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదని, రానున్న మూడు నెలల్లోనూ వర్షాలు పడే అవకాశాలు లేవని వాతావరణ శాఖ నివేదిక సూచిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎగువ మానేరు, మధ్య మానేరు, అన్నపూర్ణ, మల్కపేట రిజర్వాయర్లలో ప్రస్తుతం ఉన్న నీటిని ప్రభుత్వ ఆదేశాల మేరకు తాగునీరు, పశువుల అవసరాలకే వినియోగించాలని స్పష్టం చేశారు. ఒక ఎకరంలో వరి సాగుకు సుమారు 35 నుంచి 40 లక్షల లీటర్ల నీరు అవసరమవుతుందని, అదే నీటితో ఐదు నుంచి ఆరు ఎకరాల్లో ఆరుతడి పంటలు సాగు చేయవచ్చని వివరించారు. భూగర్భ జలాలు అడుగంటుతున్న నేపథ్యంలో బోర్ల నుంచి నీటిని తోడేందుకు విద్యుత్ వినియోగం పెరిగి భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. నీరు, విద్యుత్ లభ్యతను దృష్టిలో పెట్టుకుని రైతులు వరి సాగుకు బదులుగా పప్పుధాన్యాలు, నూనెగింజలు, మొక్కజొన్న, నువ్వులు, పొద్దుతిరుగుడు, కూరగాయలు వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు.

కొత్త బోర్లకు అనుమతి తప్పనిసరి

జిల్లాలో కొత్తగా బోర్లు వేయాలంటే సంబంధిత తహసీల్దార్ నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వాల్టా చట్ట నిబంధనల ప్రకారం అనుమతి లేకుండా ఎవరూ బోర్లు వేయకూడదని తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో నీటి వృథాను అరికట్టేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి నీటి కుళాయికి ఆన్–ఆఫ్ బటన్ ఉండేలా చూడాలని సూచించారు. మిషన్ భగీరథ, మున్సిపల్, గ్రామపంచాయతీ అధికారులు తమ పరిధిలో క్షేత్రస్థాయిలో పర్యటించి నీటి వృథాను గుర్తించి అరికట్టాలని, తలెత్తే సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయా లని, రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, మిషన్ భగీరథ ఎస్ఈ రాములు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి లక్ష్మీ నారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్‌బాబు, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలకు నిరసన

- అంబేద్కర్ చౌరస్తా వద్ద బీజేపీ ఆందోళన, దిష్టిబొమ్మ దహనం
- ప్రధాని నరేంద్ర మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి

ప్రజానావ, సిరిసిల్ల : భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పై కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసినట్లు పేర్కొన్న అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా భారతీయ జనతా పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున ఖర్గే దిష్టిబొమ్మను దహనం చేసి, కాంగ్రెస్ పార్టీ వైఖరికి వ్యతిరేకంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు శ్రీ రెడ్డబోయిన గోపి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ, బీహార్‌లోని పాట్నాలో జరిగిన సమావేశంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని అన్నారు. దేశ ప్రధానమంత్రి పట్ల రాజకీయ నాయకులు గౌరవప్రదమైన భాషను ఉపయోగించాలని, రాజకీయ విమర్శలు విధానాలు, పాలన, ప్రజా సమస్యలకే పరిమితం కావాలని పేర్కొన్నారు. ప్రధానమంత్రి కుటుంబ సభ్యులను ఉద్దేశించి వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం రాజకీయ సంస్కృతికి విరుద్ధమని ఆయన అన్నారు. ప్రజాస్వామ్యంలో విమర్శలకు స్థానం ఉన్నప్పటికీ, వ్యక్తిగత దూషణలకు తావివ్వకూడదని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు మట్టా వెంకటేశ్వర్ రెడ్డి, పార్లమెంట్ కో–కన్వీనర్ ఆడెపు రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శులు పొన్నాల తిరుపతిరెడ్డి, సిరికొండ శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లారపు సంతోష్ రెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఉడుగుల యాదగిరి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రేగుల సంతోష్ బాబు, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కిరణ్ నాయక్, ధార్మిక సెల్ జిల్లా కన్వీనర్ డా. సత్యనారాయణ, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్ పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానంతో సమానం

- పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో మెగా రక్తదాన శిబిరం
- 400 మంది స్వచ్ఛంద రక్తదానం
- యువతకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎస్పీ మహేష్ బి. గితే పిలుపు



ప్రజానావ, వేములవాడ : ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో వేములవాడలోని మహా లింగేశ్వర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే శిబిరాన్ని ప్రారంభించగా, పోలీసు అధికారులు, సిబ్బంది, యువత, ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులు సహా సుమారు 400 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ దేశ రక్షణ, అంతర్గత భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు సమాజానికి స్ఫూర్తిదాయకమన్నారు. పోలీసు శాఖ శాంతిభద్రతల పరిరక్షణతోపాటు సామాజిక బాధ్యతగా ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందని తెలిపారు. అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు వారి త్యాగాలను గుర్తుచేసుకోవడంతోపాటు సమాజం పట్ల సేవాభావం, బాధ్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. సెలవులు లేకుండా నిరంతరం విధులు నిర్వహిస్తూ పోలీసులు ప్రజలకు అండగా నిలుస్తున్నారని అన్నారు. స్నేహపూర్వక పోలీసింగ్ ద్వారా ప్రజల్లో భరోసా కల్పిస్తున్నామని, అయితే ఈ విధానం ప్రజల కోసమేనని, నేరస్తుల పట్ల కాదని స్పష్టం చేశారు. ఎవరైనా నేరాలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 'ఆరైవ్ అలైవ్' కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడంతోపాటు మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై యువతలో చైతన్యం తీసుకొస్తున్నట్లు వివరించారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకుని రక్తదానం వంటి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు.

రక్తదానం విలువైన సామాజిక సేవ

పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ జిల్లాలో సంస్మరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. అందులో భాగంగానే వేములవాడలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రక్తదానం అత్యంత విలువైన సామాజిక సేవ అని, అత్యవసర సమయాల్లో రక్తం అందక ఏ ఒక్కరి ప్రాణం ప్రమాదంలో పడకుండా స్వచ్ఛంద రక్తదాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యవంతు లైన ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంపొందించుకుని ప్రాణదాతలుగా నిలవాలని సూచించారు. అనంతరం రక్తదానం చేసిన వారికి ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు శ్రీనివాసులు, నాగేంద్రచారి, వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్మన్ రాజు, వైస్ చైర్మన్ శేఖర్, సీఐలు వీరప్రసాద్, శ్రీనివాస్, రవీందర్, రవి, నాగేశ్వరరావు, ఆర్ఐలు సురేష్, రమేష్, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ గూడూరి రవీందర్, వేణుకుమార్, పాతురి సంజీవరెడ్డి, శ్రీధర్, డాక్టర్ సంతోష్, ఎస్ఐలు, యువత, మీడియా ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చెరువుల నింపుదలకు ఇదే ఆఖరి అవకాశం

- ఎల్‌నినో ప్రభావంతో తగ్గుతున్న నీటిమట్టాలు
- సరస్వతి కాలువకు నీటి విడుదలపై అధికారుల కసరత్తు



ప్రజానావ, నిర్మల్ : ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొంటున్న నేపథ్యంలో నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేస్తున్నారు. మరోవైపు జిల్లాలోని చాలా చెరువుల్లో నీటిమట్టాలు గణనీయంగా తగ్గిపోగా, మరికొన్ని పూర్తిగా ఎండిపోయాయి. ఈ పరిస్థితుల్లో శ్రీరామసాగర్ జలాశయం నుంచి సరస్వతి కాలువ ద్వారా నీటిని విడుదల చేసేందుకు నీటిపారుదలశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కాలువ నిర్మల్, సోన్, లక్ష్మణచాంద, మామడ, ఖానాపూర్, పెంబి, కడెం మండలాల మీదుగా ప్రవహించి కడెం ప్రాజెక్టులో కలుస్తుంది. దీని పరిధిలోని 28 ఉపకాలువల కింద సుమారు 33 వేల ఎకరాల ఆయకట్టులో రైతులు పంటలు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం వరి పంట పొట్టదశలో ఉండటంతో పొలాలకు నీటి తడులు అత్యవసరంగా మారాయి. గత కొన్ని నెలలుగా అధికారులు వారబందీ పద్ధతిలో కాలువ ద్వారా నీటిని విడుదల చేయగా, వారం క్రితం నీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. అయితే కాలువ ఆయకట్టుతోపాటు చెరువుల పరిధిలోనూ వరి సాగు అధికంగా ఉండటంతో పంటలను కాపాడుకునేందుకు రైతులు ఆందోళన చెందుతున్నారు. పాలకులు, ప్రజలు, రైతుల విజ్ఞప్తుల మేరకు నీటిపారుదలశాఖ అధికారులు మంగళవారం నుంచి సరస్వతి కాలువకు నీటిని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ విడత నీటి విడుదలే చివరి అవకాశమనే ప్రచారం నేపథ్యంలో అందు బాటులోకి వచ్చే నీటిని రైతులు జాగ్రత్తగా వినియోగించు కోవాల్సిన అవసరం ఉంది. వారం రోజులపాటు వచ్చే నీటిని ప్రణాళికాబద్ధంగా సద్వినియోగం చేసుకుంటే పంటలకు అవసరమైన తడులు అందించడంతోపాటు చెరువులను నింపుకునేందుకు కూడా అవకాశం ఉంటుంది. సరస్వతి కాలువ ద్వారా వచ్చే నీటితో ఆయా మండలాల్లోని గ్రామాల పరిధిలో ఉన్న చెరువులను నింపుకునే వెసులుబాటు ఉంది. ఈ నేపథ్యంలో నీటిపారుదలశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు సమన్వయంతో వ్యవహరించి గొలుసుకట్టు చెరువులను నింపేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. దీనివల్ల పంటలకు సాగునీరు అందించడంతోపాటు పశుపక్ష్యాదులకు, ప్రజలకు తాగునీటి అవసరాలు తీర్చేందుకు కూడా కొంతమేర ప్రయోజనం చేకూరుతుందని భావిస్తున్నారు.

ప్రభుత్వ కార్యాలయం వద్దే తాగునీటి వృథా

- ఎల్‌నినోతో కరువు ముప్పు పొంచి ఉన్న వేళ అధికారుల నిర్లక్ష్యం
- ఎంపీడీవో కార్యాలయం వద్ద ట్యాంక్ ఓవర్‌ఫ్లో

ప్రజానావ, గుడిహత్నూర్ : ఓవైపు ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందని, నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని ప్రభుత్వం విస్తృతంగా అవగాహన కల్పిస్తుంటే.. మరోవైపు అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ కార్యాలయం వద్దే విలువైన తాగునీరు వృథాగా పోతోంది. గుడిహత్నూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉన్న నీటి ట్యాంకు నుంచి నిత్యం నీరు పొంగిపొర్లుతూ రోడ్లపైకి చేరుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రానున్న రోజుల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అధికార యంత్రాంగం పర్యవేక్షణ లోపం ఈ పరిస్థితికి అద్దం పడుతోందని విమర్శిస్తున్నారు. ట్యాంకు నిండిన తర్వాత కూడా నీరు నిరంతరంగా వృథా అవుతున్నా కనీస మరమ్మతులు చేపట్టకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నీటి పొదుపుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న సమయంలో ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణంలోనే ఈ విధంగా నీరు వృథా కావడం అధికారుల పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ట్యాంకు ఓవర్‌ఫ్లో సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, విలువైన తాగునీరు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

మద్యం విక్రయాల్లో వివక్ష..

బార్ల యజమానుల ధర్నా

- బెల్టు షాపులు, వైన్స్‌లో సిట్టింగ్‌లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- కాగజ్‌నగర్ ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసన

ప్రజానావ, కాగజ్‌నగర్ : మద్యం విక్రయాల విషయంలో తమ పట్ల అధికారులు వివక్ష చూపుతున్నారని ఆరోపిస్తూ కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో మూడు బార్ల యజమానులు, కార్మికులు ఆందోళనకు దిగారు. బార్ల నిర్వహణపై వివిధ ఆంక్షలు విధిస్తున్న అధికారులు.. మరోవైపు బెల్టు షాపులు, వైన్స్‌లో అనుమతి గదుల పేరుతో సిట్టింగ్‌లు కొనసాగుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం కాగజ్‌నగర్ ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. బెల్టు షాపుల నిర్వహణపై చర్యలు తీసుకోవడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైన్స్‌లో అనుమతి గదుల పేరుతో మద్యం సేవించేందుకు సిట్టింగ్‌లు కొనసాగుతున్నప్పటికీ తగిన చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. మరోవైపు బార్ల నిర్వహణపై ఆంక్షలు విధించడంతోపాటు అదనపు ఆర్థిక భారం మోపుతున్నారని తెలిపారు. ఒకే తరహా వ్యాపార కార్యకలాపాలకు సంబంధించి భిన్నమైన నిబంధనలు అమలు చేయడం సరికాదన్నారు. బార్ల నిర్వహణ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా స్పందన లేదని యజమానులు తెలిపారు. ఈ సమస్య పరిష్కారం కోసం హైకోర్టును కూడా ఆశ్రయించినట్లు వెల్లడించారు. అయినప్పటికీ తమ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో నిరసనకు దిగాల్సి వచ్చిందని పేర్కొన్నారు. బార్ల నిర్వహణకు సంబంధించిన నిబంధనలను పునఃపరిశీలించాలని, బెల్టు షాపులు, వైన్స్‌లో సిట్టింగ్‌ల అంశంపై కూడా అధికారులు స్పష్టమైన వైఖరి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మద్యం వ్యాపారాలకు సంబంధించిన నిబంధనలను అందరికీ సమానంగా అమలు చేసి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ ఆందోళనపై ఎక్సైజ్ శాఖ అధికారులు ఎలా స్పందిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

విద్యార్థుల్లో సామాజిక బాధ్యత పెంపొందించాలి

ప్రజానావ, పరకాల : పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పరకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెరీర్ గైడెన్స్ సెల్, పరకాల పోలీసు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 'సమాజంలో పోలీసుల పాత్ర' అనే అంశంపై జరిగిన ఈ పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పరకాల సీఐ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలంటే స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకొని, పటిష్టమైన ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించడంతోపాటు చట్టాలపై అవగాహన కల్పించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్రను విద్యార్థులు తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సంతోష్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్.మల్లయ్య, కెరీర్ గైడెన్స్ సెల్ విభాగాధిపతి డాక్టర్ అశోక్ లీషా, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ రామకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




పినరయి విజయన్‌కు ఊరట

సీఎంఆర్ఎల్ లంచాల కేసులో ఎఫ్ఐఆర్ ఆదేశాలపై హైకోర్టు స్టే

తిరువనంతపురం : కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు భారీ ఊరట లభించింది. సీఎంఆర్ఎల్ లంచాల కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ సింగిల్ బెంచ్ ఇచ్చిన ఆదేశాలపై హైకోర్టు స్టే విధించింది. విజయన్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ నటరాజన్, జస్టిస్ జాన్సన్ జాన్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ కేసులో ఎఫ్ఐఆర్ నమోదుకు సంబంధించిన తదుపరి చర్యలకు తాత్కాలికంగా అడ్డుకట్ట పడింది.

ఆప్ సర్పంచ్ సోదరు దారుణ హత్య

- **గురుద్వారా నుంచి వస్తుండగా కాల్పులు**
- **స్నేహితుడికి గాయాలు, నలుగురు నిందితుల గుర్తింపు**



అమృత్‌సర్ : పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ సర్పంచ్ కరజ్ సింగ్ సోదరుడు తీరత్ సింగ్ కాల్పుల్లో హత్యకు గురయ్యాడు. చాతివిండి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ గురుద్వారా వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. తీరత్ సింగ్ తన స్నేహితుడు రంజిత్ సింగ్‌తో కలిసి గురుద్వారాలో ప్రార్థనలు ముగించుకుని బయటకు వస్తుండగా దుండగులు వారిపై విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన తీరత్ సింగ్‌ను ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బుల్లెట్ గాయాలైన రంజిత్ సింగ్ ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని డీఎస్పీ యద్వీందర్ సింగ్ తెలిపారు. గతంలో ఉన్న భూ వివాదమే ఈ దాడికి కారణమై ఉండవచ్చని ప్రాథమికంగా అనుమానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఘటన వెనుక రాజకీయ కక్షలు లేవని స్పష్టం చేశారు. దాడికి సంబంధించి నలుగురు నిందితులను గుర్తించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఇప్పటివరకు ఎవరినీ అరెస్టు చేయలేదు. గ్రామంలోని ప్రత్యర్థి వర్గానికి చెందిన వారే తమపై దాడి చేశారని తీరత్ సింగ్ కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కాల్పులకు దారితీసిన పరిస్థితులపై పోలీసులు మరింత లోతుగా విచారణ చేపట్టారు.


గోప్యతా చట్టంపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన 21 వార్తా సంస్థలు

- **పరిశోధనాత్మక జర్నలిజానికి అడ్డంకిగా మారుతుందని ఆందోళన**
- **పత్రికా స్వేచ్ఛకు ముప్పు అంటున్న ప్రచురణకర్తలు**

న్యూఢిల్లీ : భారత ప్రభుత్వం అమలు చేస్తున్న డిజిటల్ వ్యక్తిగత సమాచార గోప్యతా చట్టాన్ని సవాలు చేస్తూ ముకేశ్ అంబానీ, గౌతమ్ అదానీల యాజమాన్యంలోని సంస్థలు సహా 21 వార్తా సంస్థలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. ఈ చట్టం పరిశోధనాత్మక జర్నలిజాన్ని అణచివేసే ప్రమాదం ఉందని, జర్నలిస్టులకు సమాచారాన్ని అందించే వర్గాల వివరాలను కేంద్ర ప్రభుత్వం గుర్తించే పరిస్థితి ఏర్పడుతుందని ఆయా సంస్థలు ఆందోళన వ్యక్తం చేసినట్టు తెలుస్తున్నది. వినియోగదారుల డిజిటల్ వ్యక్తిగత సమాచారాన్ని పరిరక్షించే లక్ష్యంతో నరేంద్ర మోదీ ప్రభుత్వం గత ఏడాది ఈ చట్టాన్ని అమలు చేస్తున్నట్టు ప్రకటించింది. అయితే, మీడియా సంస్థలకు ప్రత్యేక మినహాయింపులు కల్పించకపోవడంపై ప్రచురణకర్తలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ చట్టం పత్రికా స్వేచ్ఛపై దాడి వంటిదని వారు పేర్కొంటున్నారు. పత్రికా స్వేచ్ఛకు రక్షణ ఉంటుందని ప్రభుత్వం ఆగస్టులో నిర్వహించిన సమావేశంలో మీడియా సంస్థలకు హామీ ఇచ్చినప్పటికీ, యూరోపియన్ యూనియన్, సింగపూర్, బ్రిటన్‌లలో ఉన్నట్టుగా జర్నలిస్టులకు లిఖితపూర్వక మినహాయింపు లేకపోవడం ఆందోళన కలిగిస్తున్నదని భారత డిజిటల్ వార్తా ప్రచురణకర్తల సంఘం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన రహస్య పత్రంలో పేర్కొంది. ఈ పత్రాన్ని రాయిటర్స్ వార్తా సంస్థ పరిశీలించినట్టు వెల్లడించింది.

నవంబర్ 3 నుంచి ప్రైవేట్ బస్సుల నిరవధిక సమ్మె

- **మహిళలకు ఉచిత ప్రయాణంతో నష్టాలు**
- **పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆపరేటర్ల ఆగ్రహం**



పాలక్కాడ్ : కేరళలో ప్రైవేట్ బస్సుల యజమానులు నిరవధిక సమ్మెకు సిద్ధమయ్యారు. ప్రభుత్వ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం వల్ల తమకు ఎదురవుతున్న నష్టాలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా నవంబర్ 3 నుంచి బస్సులను నిలిపివేయనున్నట్లు మంగళవారం పాలక్కాడ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రకటించారు. ఈ నెల 10న రవాణా శాఖ మంత్రి జాన్‌తో జరిపిన చర్చలు ఫలప్రదం కాకపోవడంతో సమ్మె నిర్ణయం తీసుకున్న ట్లు వెల్లడించారు. ప్రైవేట్ బస్సులు నడిచే మార్గాల్లో ప్రభుత్వం విరాళాల సహకారంతో బస్సులను నడపడం వల్ల తమ ఉపాధి దెబ్బతింటున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే నవంబర్ 3 నుంచి బస్సుల రాకపోకలను పూర్తిగా నిలిపివేస్తామని హెచ్చరించారు. తమ సమస్యల పరిష్కారం కోసం గత నెలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిషన్ పలు సిఫార్సులు చేసినప్పటికీ, వాటిని అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు.

బ్రిటన్‌లో రోడ్డు రేసింగ్.. ఇద్దరికి 28 ఏళ్ల జైలు

- **అతివేగంతో తల్లీకూతుళ్ల మృతి**
- **ఒకరికి 12 ఏళ్లు, మరొకరికి 16 ఏళ్ల శిక్ష**

లండన్: బ్రిటన్‌లో ప్రజలు ప్రయాణించే రహదారిపై కార్లతో పోటీపడి రేసింగ్ నిర్వహించి, తల్లీకూతుళ్ల మృతికి కారణమైన ఇద్దరు భారత సంతతి వ్యక్తులకు న్యాయస్థానం మొత్తం 28 ఏళ్ల జైలు శిక్ష విధించింది. ఈ కేసులో జస్‌కమల్ రియాత్ (37), హర్దీప్ బాచూ (29)లకు శిక్ష ఖరారైంది. వీరు నిర్వహించిన రేసింగ్ కారణంగా జరిగిన ప్రమాదంలో పాఠశాలకు వెళ్తున్న తల్లీకూతుళ్ల ప్రాణాలు కోల్పోయారు. హర్దీప్ బాచూకు చెందిన ఆడీ టీటీ ఆర్ఎస్ కారు వారిని ఢీకొట్టడంతో ఈ విషాదం చోటుచేసుకుంది. బాచూతో కలిసి జస్‌కమల్ రియాత్ కూడా రేసింగ్‌లో పాల్గొన్నట్లు నిఘా కెమెరాల దృశ్యాల ద్వారా వెల్లడైంది. రియాత్ బీఎండబ్ల్యూ ఎం135ఐ కారులో పోటీపడినట్లు విచారణలో తేలింది. నేరాన్ని అంగీకరించిన బాచూకు 12 ఏళ్ల జైలు శిక్ష విధించగా, తన తప్పు లేదని వాదించిన రియాత్‌కు 16 ఏళ్ల శిక్ష పడింది. వీరిద్దరూ ఆరేళ్లపాటు వాహనాలు నడపకుండా నిషేధం కూడా విధించారు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో ఇద్దరికీ ముందుగా పరిచయం లేదని విచారణలో తేలింది. ఓ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద కార్లు పక్కపక్కనే ఆగినప్పుడు పరిచయం చేసుకున్న వీరు, తమ కార్ల సామర్థ్యాన్ని పరీక్షించుకోవాలనే ఉద్దేశంతో రోడ్డుపై పోటీకి దిగినట్లు వెల్లడైంది. బాచూ కారు డాష్‌క్యామ్ దృశ్యాలు, రియాత్ ఫోన్‌లో లభించిన సమాచారం ఆధారంగా ఈ విషయం నిర్ధారణ అయినట్లు విచారణలో పేర్కొన్నారు. తీర్పు సందర్భంగా న్యాయమూర్తి రే సింగ్ మాట్లాడుతూ రహదారులు రేసింగ్ ట్రాక్‌లు కావని, ప్రజలు ప్రయాణించే రోడ్లపై శక్తివంతమైన కార్లతో వేగాన్ని పరీక్షించుకోవడం సరికాదని వ్యాఖ్యానించారు.

లారెన్స్ బిష్ణోయ్‌కు మరింత కట్టుదిట్టమైన భద్రత

- **టైగర్ ష్రాఫ్‌పై కాల్పుల ఘటనతో అప్రమత్తం**
- **సబర్మతి జైలులో హైసెక్యూరిటీ బ్లాక్‌కు తరలింపు?**



గుజరాత్ : బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్‌పై కాల్పుల ఘటన నేపథ్యంలో గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ పేరు తెరపైకి రావడం కలకలం రేపుతున్నది. ఈ దాడి వెనుక అతడి ముఠా ప్రమేయం ఉందంటూ వార్తలు వెలువడుతున్న నేపథ్యంలో, అతడిపై దాడి జరిగే అవకాశం ఉందన్న అనుమానాలతో జైలు అధికారులు భద్రతను మరింత కట్టుదిట్టం చేసినట్లు సమాచారం. ఇందులో భాగంగా గుజరాత్‌లోని సబర్మతి కేంద్ర కారాగారంలో అతడిని హైసెక్యూరిటీ బ్లాక్‌కు మార్చినట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఇప్పటివరకు '10–సెల్ బ్లాక్'లో ఉన్న అతడిని తాజాగా '200 బ్లాక్'కు తరలించినట్లు తెలుస్తున్నది. ఈ బ్లాక్‌ను నాలుగు విభాగాలుగా విభజించగా, ఒక్కో విభాగంలో 50 మంది చొప్పున మొత్తం 200 మంది ఖైదీలు ఉంటారు. ఒక్కో గది 7.5×11 అడుగుల విస్తీర్ణంలో ఉంటుంది. ఖైదీలు పరస్పరం సంభాషించకుండా నిరంతర నిఘా ఏర్పాటు చేసినట్లు సమాచారం. 2008 బాంబు పేలుళ్ల కేసుల్లో దోషులుగా తేలిన వారు కూడా ఇదే బ్లాక్‌లో శిక్ష అనుభవిస్తున్నట్లు తెలుస్తున్నది. పంజాబ్‌కు చెందిన లారెన్స్ బిష్ణోయ్ 2010–12 మధ్య నేర కార్యకలాపాలు ప్రారంభించిన ట్లు దర్యాప్తు సంస్థలు పేర్కొన్నాయి. హత్యలు, దోపిడీలు సహా పలు కేసులు అతడిపై నమోద య్యాయి. 2014లో అక్రమ ఆయుధాల కేసులో అరెస్ట యిన అతడిని పంజాబ్ లోని పలు జైళ్లతోపాటు ఢిల్లీలోని తీహార్ జైలు లోనూ నిర్బంధించారు. అయితే జైలులో ఉన్నప్పటికీ నేర కార్యకలాపాలను కొనసాగించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. జైలు ఫోన్ ద్వారా దోపిడీల కోసం బెదిరింపు కాల్స్ చేయడం, తన అనుచరులకు ఆడియో, వీడియో సందేశాలు పంపడం వంటి చర్యలకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. కస్టడీలో ఉండగానే అతడు ఓసారి మీడియాకు ఇంటర్వ్యూ ఇవ్వడం కూడా వివాదానికి దారితీసింది. అనంతరం మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు సంబంధించిన కేసులో 2023లో గుజరాత్ ఉగ్రవాద నిరోధక దళం అతడిని అదుపులోకి తీసుకుని సబర్మతి కేంద్ర కారాగారానికి తరలించింది. అప్పటి నుంచి అక్కడే ఉన్నాడు. గత రెండేళ్లుగా బయటి వ్యక్తులతో ఫోన్‌లో మాట్లాడ టం, నేరుగా సంప్రదింపులు జరపడం లేదని, తన న్యాయ బృందంతో మా త్రమే మాట్లా డుతున్నా డని దర్యాప్తు అధికారు లు తెలిపినట్లు కథనాలు పేర్కొంటు న్నాయి. కోర్టు విచారణల కు సైతం వర్చువల్ విధానంలో హాజర వుతున్నట్లు సమా చారం. అయిన ప్పటికీ అతడి పేరుతో నేర కార్యకలాపాలు కొనసాగు తుండటం భద్రతా సంస్థలకు సవాలుగా మారింది. లారెన్స్ బిష్ణోయ్‌కు సన్నిహితులుగా చెప్పబడుతున్న గోల్డీ బ్రార్, రోహిత్ గొదారా వంటి వారు విదేశాల్లో ఉంటూ నేరాలకు కుట్రలు చేస్తున్నట్లు దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. వారి నెట్‌వర్క్‌ను ఛేదించేందుకు భద్రతా సంస్థలు ప్రయత్నాలు కొనసాగిస్తున్నాయి.

హౌతీలతో సౌదీ రహస్య ఒప్పందం?

- **దాడులు ఆపితే 1 బిలియన్ డాలర్లు చెల్లించే ప్రతిపాదన**
- **ఇరాన్ మధ్యవర్తిత్వంతో శాంతి చర్చలు**



సౌదీ అరేబియా : పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చుతున్న నేపథ్యంలో హౌతీ తిరుగుబాటు దారులతో సౌదీ అరేబియా రాజీకి వచ్చినట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. తమ దేశంలోని చమురు క్షేత్రాలు, విమానాశ్రయాలు, ఇతర మౌలిక సదుపాయాలపై దాడులను పూర్తిగా నిలిపివేస్తే హౌతీలకు 1 బిలియన్ డాలర్లు (సుమారు రూ.9,500 కోట్లు) చెల్లించేందుకు సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ ప్రతిపాదించినట్లు సమాచారం. ఇరాన్ మధ్యవర్తిత్వంతో ఈ ఒప్పందం కుదిరినట్లు కథనాలు పేర్కొంటున్నప్పటికీ, దీనిపై సౌదీ అధికారుల నుంచి అధికారిక ధ్రువీకరణ రావాల్సి ఉంది. హౌతీలు డ్రోన్లు, క్షిపణులతో సౌదీ చమురు కేంద్రాలు, ఇతర కీలక మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుంటున్నట్లు వార్తలు వస్తున్నాయి. మరోవైపు హర్మూజ్ జలసంధి వద్ద ట్యాంకర్లపై దాడులు, చమురు రవాణాకు ఎదురవుతున్న ఆటంకాలు గల్ఫ్ దేశాల ఇంధన ఎగుమతులపై ప్రభావం చూపుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో కాల్పుల విరమణ కోసం సౌదీ నాయకత్వం హౌతీలతో చర్చలకు సిద్ధమైనట్లు సమాచారం. ఈ ఒప్పందానికి సంబంధించిన చర్చల కోసమే సౌదీ రక్షణ మంత్రి ప్రిన్స్ ఖలీద్ బిన్ సల్మాన్ ఇటీవల టెహ్రాన్ పర్యటించినట్లు ఇజ్రాయెల్ మీడియా కథనాలు వెల్లడించాయి. ఆయన ప్రయాణించిన సైనిక రవాణా విమానంలో హౌతీలకు చెల్లించేందుకు ఉద్దేశించిన నగదును తీసుకువచ్చినట్లు కూడా ప్రచారం జరుగుతోంది. అయితే ఈ వివరాలన్నీ స్వతంత్రంగా ధ్రువీకరించాల్సి ఉంది. ఇరాన్ మధ్యవర్తిత్వంతో జరిగినట్లు చెబుతున్న శాంతి చర్చల్లో టర్కీ నిఘా విభాగం అధిపతి, పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) సీనియర్ అధికారులు పాల్గొన్నట్లు కథనాలు పేర్కొన్నాయి. యెమెన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా హౌతీలు పోరాడుతున్న సమయంలో సౌదీ అరేబియా ప్రత్యక్షంగా రంగంలోకి దిగడంతో ఇరుపక్షాల మధ్య ఘర్షణలు ప్రారంభమ య్యాయి. అప్పటి నుంచి కొనసాగుతున్న వైరం నేపథ్యంలో దాడులను నిలిపివేసి, ప్రాంతీయ ఉద్రిక్తతలను తగ్గించుకునేందుకు సౌదీ అరేబియా ఆర్థిక ఒప్పందం ద్వారా రాజీ ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే 1 బిలియన్ డాలర్ల చెల్లింపు, కాల్పుల విరమణ ఒప్పందం, చర్చల్లో పాల్గొన్న వారి వివరాలపై అధికారిక ప్రకటన వెలువడే వరకు వీటిని ధ్రువీకరించిన వాస్తవాలుగా పరిగణించలేం.

తమిళనాడులో జైలు నుంచి 17 మంది ఖైదీల పరారీ

- **మూర్ఛ వచ్చినట్లు నటించి సిబ్బందిపై దాడి**
- **నలుగురు పట్టివేత, మరో 13 మంది కోసం గాలింపు**

మధురై : తమిళనాడులోని తేని జిల్లాలో జైలు నుంచి 17 మంది ఖైదీలు పరారయ్యారు. తెక్కంపట్టి సబ్‌జైల్లో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఖైదీల్లో కొందరు మూర్ఛ, ఫిట్స్ వచ్చినట్లు నటించడంతో అప్రమత్తమైన జైలు సిబ్బంది సహాయం చేసేందుకు గదిని తెరిచారు. ఇదే అదనుగా భావించిన కొందరు ఖైదీలు సిబ్బందిపై దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనలో ముగ్గురు సిబ్బంది గాయపడినట్లు ప్రాథమిక సమాచారం. గ్రేడ్–2 కానిస్టేబుల్ తంగపాండి తలకు తీవ్ర గాయాలు కావడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మరో ఇద్దరు కూడా గాయపడ్డారు. పరారైన ఖైదీల్లో ప్రవీణ్ కుమార్, సిలంబరాసం, రాజా సికందర్, రాజ్‌కుమార్‌లను పోలీసులు పట్టుకున్నారు. మిగిలిన 13 మంది కోసం గాలిస్తున్నారు. ఖైదీల ఆచూకీ కోసం 17 ప్రత్యేక బృందాలను రంగంలోకి దించినట్లు ఐజీ విజయేంద్ర బిదారి తెలిపారు.



దుబాయ్‌లో 24 క్యారెట్ల బంగారు నడక మార్గం

- **2026 చివరి నాటికి ప్రారంభానికి సన్నాహాలు**
- **16.514 కిలోల బంగారు జుంకాలకు రెండు గిన్నిస్ రికార్డులు**

దుబాయ్ : మెరిసే ఆకాశహర్మ్యాలు, విలాసవంతమైన నిర్మాణాలకు పేరుగాంచిన దుబాయ్ మరో అరుదైన ఆకర్షణకు వేదిక కానున్నది. ప్రపంచంలోనే తొలిసారిగా 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారంతో అత్యంత పొడవైన నడక మార్గాన్ని ఏర్పాటు చేయనున్నట్టు దుబాయ్ గోల్డ్ డిస్ట్రిక్ట్ ప్రకటించింది. ఈ బంగారు నడక మార్గాన్ని 2026 చివరి నాటికి ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సున్నితమైన డిజైన్లతో రూపొందించిన బంగారు హారాల నుంచి పెట్టుబడుల కోసం కొనుగోలు చేసే బంగారు కడ్డీల వరకు అనేక రకాల ఉత్పత్తులతో దుబాయ్‌లోని సంప్రదాయ బంగారు మార్కెట్లు ప్రపంచవ్యాప్తంగా కొనుగోలుదారులను ఆకర్షిస్తున్నా యి. ఈ నేపథ్యంలో ప్రతిపాదిత బంగారు నడక మార్గం మరో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నది. విలువైన లోహాన్ని ప్రత్యక్ష అనుభవంగా మార్చేలా దీనిని రూపొందిస్తున్నారు. 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారంతో నిర్మించే ఈ నడక మార్గంపై పర్యాటకులు నడుస్తూ దుబాయ్ గోల్డ్ డిస్ట్రిక్ట్ అందాలను వీక్షించవచ్చు. అయితే ఈ మార్గం కచ్చితమైన పొడవు, నిర్మాణ వ్యయం, ప్రారంభ తేదీ వంటి వివరాలను అధికారులు ఇంకా వెల్లడించలేదు. ఇదిలా ఉండగా, దుబాయ్ మరో అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. సంప్రదాయ భారతీయ శైలిలో చేతితో తయారు చేసిన ఒక జత బంగారు జుంకా చెవిపోగులకు రెండు గిన్నిస్ ప్రపంచ రికార్డులు లభించాయి. జోయాలుక్కాస్ జ్యువెలరీ రూపొందించిన ఈ చెవిపోగుల జతకు 'మయూర సహస్ర' అని పేరు పెట్టారు. 22 క్యారెట్ల బంగారంతో తయారు చేసిన వీటి మొత్తం బరువు 16.514 కిలోలు. ప్రపంచంలోనే అత్యంత బరువైన చెవిపోగుల జతగా, అతిపెద్ద చెవిపోగుల జతగా ఇవి గిన్నిస్ ప్రపంచ రికార్డుల్లో స్థానం సంపాదించాయి. ఈ అరుదైన ఆభరణాలను విక్రయానికి ఉంచకుండా దుబాయ్‌లో శాశ్వతంగా ప్రదర్శనకు ఏర్పాటు చేయనున్నారు. దీంతో స్థానికులు, పర్యాటకులు ఈ భారీ బంగారు జుంకాలను ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం కలగనున్నది.

హోటల్‌లో భీకర కాల్పులు.. ఐదుగురు మృతి

- **యజమాని, లీజుదారుడి మధ్య వివాదమే కారణం**
- **గంటలోనే నిందితుడి అరెస్టు**

గౌహతి : అస్సాంలోని గౌహతిలో దారుణం చోటుచేసుకుంది. ఓ హోటల్‌లో జరిగిన కాల్పుల్లో ఐదుగురు ప్రాణాలు కోల్పోగా, మరొకరు గాయప డ్డారు. హోటల్ యజమాని, లీజుదారుడి మధ్య తలెత్తిన ఆస్తి వివాదమే ఈ ఘటనకు కారణంగా తెలుస్తున్నది. గౌహతిలోని బిలాస్ ఇన్ హోటల్‌లో రాత్రి 9 గంటల సమయంలో ఈ కాల్పులు జరిగాయి. అస్సాం పోలీసు ప్రధాన కార్యాలయానికి కేవలం రెండు కిలోమీటర్ల దూరంలో ఈ ఘటన చోటుచేసుకోవడం కలకలం రేపింది. ఈ ఘటనలో ఆరుగురికి బుల్లెట్ గాయాలు కాగా, వారిలో ఐదుగురు మృతి చెందినట్లు పోలీసు కమిషనర్ పార్థసారథి మహంత తెలిపారు. కాల్పులకు పాల్పడిన వ్యక్తిని హోటల్ లీజుదారుడు గణకంట గగోయ్‌గా గుర్తించినట్లు వెల్లడించారు. ఘటన జరిగిన గంటలోపే పల్టన్ బజార్ ప్రాంతంలో అతడిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. కాల్పులకు ఉపయోగించిన .32 బోర్ లైసెన్స్ పిస్తోలును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హోటల్ లీజు ఒప్పందానికి సంబంధించిన వివాదమే కాల్పులకు దారితీసినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైందని పోలీసులు తెలిపారు. మృతి చెందిన ఐదుగురూ హోటల్ యజమానికి సంబంధించిన వారేనని, వారిలో నలుగురు ఒకే కుటుంబానికి చెందినవారని వెల్లడించారు. ఏడాది క్రితం గణకంట గగోయ్ ఈ హోటల్‌ను లీజుకు తీసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. ఘటనపై కేసు నమోదు చేసి, కాల్పులకు దారితీసిన పరిస్థితులపై సమగ్ర దర్యాప్తు చేపట్టారు.


కాంగ్రెస్ ర్యాలీ వాయిదా వేయండి

- **రాహుల్‌గాంధీకి ఢిల్లీ వ్యాపార సంఘాల లేఖ**
- **దీపావళి వేళ రూ.10 వేల కోట్ల వ్యాపారంపై ప్రభావం పడే అవకాశం**

న్యూఢిల్లీ : ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ నవంబర్ 1న నిర్వహించ తలపెట్టిన భారీ ర్యాలీని వాయిదా వేయాలని ఢిల్లీ వ్యాపార సంఘాలు కోరాయి. దీపావళి పండుగ సమయంలో నిరసన కార్యక్రమం నిర్వహిస్తే వ్యాపారాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ మేరకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి లేఖ రాశాయి. దీనిపై కాంగ్రెస్ పార్టీ నుంచి స్పందన రాకపోవడంతో ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ) మరోసారి లేఖ ద్వారా తమ అభ్యంతరాలను తెలియజేసింది. సుమారు పది లక్షల మంది నిరసనకారులు ఢిల్లీకి వస్తే వ్యాపారాలు ఎలా నిర్వహించుకోవాలని ప్రశ్నించింది. దీపావళి పండుగ సీజన్‌లో ర్యాలీ నిర్వహించడం వల్ల రామ్‌లీలా మైదానం పరిసర ప్రాంతాల్లో దాదాపు రూ.10 వేల కోట్ల వ్యాపారంపై ప్రభావం పడే ప్రమాదం ఉందని పేర్కొంది. ర్యాలీని నవంబర్ 10కి వాయిదా వేయాలని లేదా వాణిజ్య ప్రాంతాలకు దూరంగా నిరసన ప్రదేశాన్ని ఎంపిక చేయాలని విజ్ఞప్తి చేసింది. ఈ లేఖ ప్రతులను రాహుల్‌గాంధీతోపాటు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు కూడా పంపినట్లు సీటీఐ ఛైర్మన్ బ్రిజేశ్ గోయల్ తెలిపారు. ఈ అంశంపై ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలతో చర్చించాలని కోరినట్లు వెల్లడించారు. అక్టోబర్ 31, నవంబర్ 1 తేదీల్లో రామ్‌లీలా మైదానం పరిసరాల్లో బారికేడ్లు ఏర్పాటు చేయడం, రహదారులను మూసివేయడం వంటి చర్యలతో వినియోగదారులు దుకాణాలకు చేరుకోలేరని వ్యాపార సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఢిల్లీలోని ఇరుకైన వీధుల్లోకి లక్షలాది మంది నిరసనకారులు, సుమారు 20 వేల వాహనాలు వస్తే వాణిజ్య కార్యకలాపాలు స్తంభించే అవకాశం ఉందని పేర్కొన్నాయి. అక్టోబర్ 10న జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన నిరసనలో సుమారు నాలుగు వేల మంది పాల్గొనడంతో ఢిల్లీ అంతటా రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని సీటీఐ తెలిపింది. ఆ ఆందోళన కారణంగా వ్యాపారులకు సుమారు రూ.3 వేల కోట్ల నష్టం వాటిల్లినట్లు వెల్లడించింది. పండుగ సమయంలో వ్యాపారులకు నష్టం కలగకుండా ర్యాలీ నిర్వహణపై కాంగ్రెస్ పార్టీ పునరాలోచించాలని వ్యాపార సంఘాలు విజ్ఞప్తి చేశాయి.

'బ్రేకింగ్ బ్యాడ్' తర్వాత 'ప్రిజన్ బ్రేక్'

- **తమిళనాడు ప్రభుత్వంపై ఎంకే స్టాలిన్ విమర్శలు**
- **జైలు భద్రతపై నిలదీత**



చెన్నై : తమిళనాడులో జోసెఫ్ విజయ్ ప్రభుత్వానికి వరుసగా ఎదురవుతున్న పరిణామాలపై మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ విమర్శలు గుప్పించారు. ఇటీవల రూ.100 కోట్ల విలువైన 135 కిలోల మాదకద్రవ్యాల అక్రమ రవాణా కేసులో తమిళగ వెట్రి కళగం (టీవీకే) నేత ఒకరు అరెస్టు కావడం, తాజాగా తేని జిల్లాలోని సబ్‌జైలు నుంచి 17 మంది ఖైదీలు పరారవడం వంటి ఘటనలను ప్రస్తావిస్తూ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ప్రముఖ వెబ్ సిరీస్‌ల పేర్లను ప్రస్తావిస్తూ సామాజిక మాధ్యమంలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తమిళనాడులో మొదట 'బ్రేకింగ్ బ్యాడ్'.. ఇప్పుడు 'ప్రిజన్ బ్రేక్' మొదలైందంటూ వ్యాఖ్యానించారు. బెయిల్‌పై బయట ఉన్న నేరస్థులపైనే ప్రభుత్వం పర్యవేక్షణ చేయడం లేదనుకున్నానని, ఇప్పుడు జైలులో ఉన్న ఖైదీలు తప్పించుకుంటున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికే పుళల్ జైలు నుంచి ఇద్దరు ఖైదీలు తప్పించుకున్న ఘటనను ప్రస్తావిస్తూ, తాజాగా తేని జైలు నుంచి 17 మంది పరారవడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని పేర్కొన్నారు. 1995 తర్వాత ఒకేసారి ఇంతమంది ఖైదీలు పరారవడం ఇదే తొలిసారని స్టాలిన్ తెలిపారు. భద్రతా ఏర్పాట్లు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. బయట ఉన్న నేరస్థులు స్వేచ్ఛగా నేరాలకు పాల్పడుతుంటే, జైళ్లలో ఉన్న ఖైదీలు సైతం తప్పించుకుంటున్నారని విమర్శించారు. ప్రజలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని, చివరకు ప్రజలే తమను తాము కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఎద్దేవా చేశారు. కాగా, ఇటీవల మాదకద్రవ్యాల అక్రమ రవాణా కేసులో టీవీకే నేత అరెస్టు కావడంపైనా స్టాలిన్ తీవ్ర విమర్శలు చేశారు. 'బ్రేకింగ్ బ్యాడ్' వెబ్ సిరీస్‌ను ప్రస్తావిస్తూ టీవీకే కేవలం 'బ్యాడ్ పార్టీ' మాత్రమే కాదని, 'బ్రేకింగ్ బ్యాడ్ పార్టీ' అంటూ వ్యాఖ్యానించారు. తాజాగా జైలు నుంచి ఖైదీలు పరారైన ఘటన నేపథ్యంలో 'ప్రిజన్ బ్రేక్' అనే మరో వెబ్ సిరీస్ పేరును ప్రస్తావిస్తూ ప్రభుత్వంపై తన విమర్శలను కొనసాగించారు.

అదానీ డాక్యుమెంటరీపై కలకత్తా హైకోర్టు నిషేధం

కోల్‌కతా : ప్రధాని నరేంద్ర మోదీ, పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీకి సంబంధించిన వివాదాస్పద డాక్యుమెంటరీపై కలకత్తా హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆ వీడియోను ప్రసారం చేయడం, అంతర్జాలంలో అప్‌లోడ్ చేయడం, ఇతరులతో పంచుకోవడంపై 2027 జనవరి 31 వరకు మధ్యంతర నిషేధం విధించింది. తదుపరి ఆదేశాలు వెలువడితే అంతకుముందే ఈ నిషేధం ముగిసే అవకాశం ఉందని స్పష్టం చేసింది. అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చింది. టెక్ వ్యాపారవేత్త సబీర్ భాటియాతోపాటు పలువురిని ప్రతివాదులుగా పేర్కొన్న సంస్థ.. వివాదాస్పద డాక్యుమెంటరీ ప్రసారాన్ని నిలిపివేయడంతోపాటు, తమ పరువుకు నష్టం కలిగించినందుకు పరిహారం చెల్లించేలా ఆదేశించాలని కోర్టును కోరింది. ఈ పిటిషన్ నేపథ్యంలో డాక్యుమెంటరీ ప్రసారం, ప్రచారం, భాగస్వామ్యంపై న్యాయస్థానం మధ్యంతర ఆంక్షలు విధించింది.

అభిషేక్ ఊచకోత

• 38 బంతుల్లోనే 113 పరుగులు • న్యూజిలాండ్‌పై భారత్ ఆరు వికెట్ల విజయం
• 13.2 ఓవర్లలోనే 199 పరుగుల లక్ష్యం ఛేదన • మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే టీ20 సిరీస్ కైవసం
• రాణించిన వైభవ్ సూర్యవంశీ • పవర్ ప్లేలో రికార్డు భాగస్వామ్యం



వెల్లింగ్టన్: అభిషేక్ శర్మ విధ్వంసకర బ్యాటింగ్‌కు న్యూజిలాండ్ బౌలర్లు బెంబేలెత్తిపోయారు. కివీస్ నిర్దేశించిన 199 పరుగుల లక్ష్యాన్ని భారత్ ఊహించని రీతిలో ఛేదించింది. మంగళవారం జరిగిన మూడో టీ20లో ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి, ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే సొంతం చేసుకుంది. ప్రపంచ నంబర్‌వన్ టీ20 బ్యాటర్ అభిషేక్ కేవలం 38 బంతుల్లోనే 113 పరుగులతో అజేయ విధ్వంసం సృష్టించగా.. 15ఏళ్ల వైభవ్ సూర్యవంశీ 18 బంతుల్లో 45 పరుగులతో ఆకట్టుకున్నాడు. వీరిద్దరూ తొలి వికెట్‌కు కేవలం ఏడు ఓవర్లలోనే 133 పరుగులు జోడించి భారత్ విజయాన్ని సులభతరం చేశారు. లక్ష్యాన్ని 13.2 ఓవర్లలోనే ఛేదించడం విశేషం.

ఆకాశమే హద్దుగా..

అభిషేక్ శర్మ మొదటి బంతి నుంచే న్యూజిలాండ్ బౌలర్లకు చుక్కలు కనిపించాయి. తొలి ఓవర్లోనే జేకబ్ డఫీ బౌలింగ్‌లో 26 పరుగులు పిండుకున్న భారత ఓపెనర్లు.. ఆ తర్వాత కూడా అదే దూకుడును కొనసాగించారు. అభిషేక్ కేవలం 15 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసుకోగా.. 35 బంతుల్లోనే శతకం సాధించాడు. మొత్తం 11 సిక్సర్లు, తొమ్మిది ఫోర్లతో 113 పరుగులు బాదాడు. సెంచరీ అనంతరం తనదైన ధ్యాన భంగిమతో సంబరాలు చేసుకున్నాడు. అతడి దెబ్బకు కివీస్ ఆటగాళ్లు వికెట్ పడినప్పుడూ పెద్దగా సంబరాలు చేసుకోలేని స్థితికి చేరుకున్నారు. మరోవైపు వైభవ్ సూర్యవంశీ కూడా బ్యాట్ ఝుళిపించాడు. కేవలం 18 బంతుల్లో నాలుగు సిక్సర్లతో 45 పరుగులు చేశాడు. ఈ జోడీ దూకుడుతో భారత్ ఐదు ఓవర్లలోనే 100 పరుగులు పూర్తి చేసి ప్రపంచ రికార్డు సృష్టించింది. పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు 118 పరుగులకు చేరింది. టీ20ల్లో పవర్‌ప్లేలో ఇదే అత్యధిక స్కోరు. తొలి ఏడు ఓవర్లలోనే 133 పరుగులు రావడంతో మ్యాచ్‌పై న్యూజిలాండ్ ఆశలు దాదాపు ఆవిరయ్యాయి.

మిచెల్ మెరుపులు..

అంతకుముందు డారిల్ మిచెల్ (89; 52 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సర్లు) చెలరేగడంతో న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో మూడు వికెట్లకు 198 పరుగులు చేసింది. ఫిన్ అలెన్ (40; 25 బంతుల్లో)తో కలిసి రెండో వికెట్‌కు 86 పరుగులు జోడించిన మిచెల్.. అనంతరం బెవన్ జాకబ్స్ (39 నాటౌట్; 23 బంతుల్లో)తో కలిసి నాలుగో వికెట్‌కు 75 పరుగులు సాధించాడు. భారత బౌలర్లలో అక్షర్ పటేల్, నితీశ్ కుమార్ రెడ్డి, అర్ష్‌దీప్ సింగ్ ఒక్కో వికెట్ తీశారు. చివరి ఓవర్లలో భారత బౌలర్లు కట్టడి చేయడంతో కివీస్ స్కోరు 200 దాటలేదు. ఇదిలాఉంటే ఈ విజయంతో భారత్ న్యూజిలాండ్ గడ్డపై వరుసగా మూడో టీ20 సిరీస్‌ను కైవసం చేసుకుంది. 2020లో 5–0తో, 2022లో 1–0తో సిరీస్‌లు గెలిచిన భారత్.. ఇప్పుడు మరోసారి తన ఆధిపత్యాన్ని చాటింది.

యువీ సవాల్ అంత ఈజీ కాదు

న్యూజిలాండ్‌తో మూడో టీ20లో 38 బంతుల్లోనే 113 పరుగులతో విధ్వంసం సృష్టించిన భారత ఓపెనర్ అభిషేక్ శర్మ.. తన గురువు యువరాజ్ సింగ్ విసిరిన సరదా సవాల్‌పై ఆసక్తికరంగా స్పందించాడు. 12 బంతుల్లో అర్ధశతకం సాధించడం అంత సులభమేమీ కాదని స్పష్టం చేశాడు. యువరాజ్ తన సామాజిక మాధ్యమ ఖాతాలో స్పందిస్తూ.. తాను ఇప్పటికీ 12 బంతుల్లో 50 పరుగులు చేయలేకపోయానని పేర్కొంటూ అభిషేక్‌ను సరదాగా సవాల్ చేశాడు. దీనిపై అభిషేక్ మాట్లాడుతూ.. అలాంటి ఘనతలు అప్పుడప్పుడు మాత్రమే సాధ్యమవుతాయని చెప్పాడు. 'యువీ ఆ సమయంలో ఎలాంటి క్రికెట్ ఆడాడో తెలియదు. కానీ 12 బంతుల్లో 50 పరుగులు చేయడం అంత సులభం కాదు. బ్యాటర్లు అలాంటి మైలురాళ్ల కోసం ప్రత్యేకంగా ఆడరు. జట్టును గెలిపించడమే మా లక్ష్యం. వైభవ్ సూర్యవంశీతో కలిసి జట్టుకు మెరుపు ఆరంభం ఇవ్వాలనుకున్నాం. అదే ప్రణాళికతో ముందుకెళ్లాం' అని అభిషేక్ వివరించాడు.



వీనస్‌కు మళ్లీ నిరాశే

• 18ఏళ్ల టాగర్ చేతిలో చిత్తు
• ఈ ఏడాది సింగిల్స్‌లో టెన్నిస్ దిగ్గజం ఖాతాలో 13వ ఓటమి
• గతేడాది జులై నుంచి వరుసగా 16 మ్యాచ్‌ల్లో పరాజయం

గ్వాంగ్‌జౌ: టెన్నిస్ దిగ్గజం వీనస్ విలియమ్స్‌కు ఓటముల పరంపర కొనసాగుతోంది. గ్వాంగ్‌జౌ ఓపెన్ తొలి రౌండ్‌లో 18 ఏళ్ల ఆస్ట్రియా క్రీడాకారిణి లిల్లీ టాగర్ చేతిలో 6–2, 6–2తో పరాజయం పాలైంది. దీంతో ఈ ఏడాది సింగిల్స్‌లో వీనస్ ఖాతాలో 13వ ఓటమి చేరింది. ఇద్దరి మధ్య 28 ఏళ్ల వయసు వ్యత్యాసం ఉండటం విశేషం. డబ్ల్యూటీఏ టూర్ మ్యాచ్‌లో ప్రత్యర్థుల మధ్య ఇదే రికార్డు స్థాయి వయోభేదమని సమాచారం. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 599వ స్థానంలో ఉన్న వీనస్.. అమెరికా ఓపెన్ తర్వాత రెండు నెలల విరామంతో మళ్లీ సింగిల్స్ బరిలోకి దిగినా ఫలితం మారలేదు. గతేడాది జులై నుంచి టూర్‌లో వరుసగా 16 సింగిల్స్ మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. ఏడు గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిళ్లు గెలిచిన ఆమె చివరిసారిగా 2008లో వింబుల్డన్ విజేతగా నిలిచింది. అదే ఏడాది జన్మించిన టాగర్ ఇప్పుడు ఆమెను ఓడించడం గమనార్హం.

సర్వీస్‌లోనూ టాగర్‌దే ఆధిపత్యం

తొలి సర్వీస్‌ల శాతం ఇద్దరికీ 63 ఉన్నా.. వాటి ద్వారా పాయింట్లు సాధించడంలో వీనస్ వెనుకబడింది. ఆమె 60 శాతం తొలి సర్వీస్ పాయింట్లే గెలవగా, టాగర్ అన్నింటినీ తన ఖాతాలో వేసుకుంది. వీనస్‌కు ఒక్క బ్రేక్ పాయింట్ అవకాశం కూడా రాలేదు. టాగర్ తనకు లభించిన 16 బ్రేక్ పాయింట్లలో నాలుగింటిని సద్వినియోగం చేసుకుంది. మరో మ్యాచ్‌లో కైట్లిన్ క్వెవెడో 6–4, 6–7 (5), 6–4తో సోఫియా కెనిన్‌ను ఓడించింది.

వన్డేల్లో హర్మన్ హవా

• ఎనిమిదో ర్యాంకుకు భారత మాజీ కెప్టెన్

దుబాయ్: భారత మహిళల క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో మెరుగుపడింది. తాజాగా విడుదలైన బ్యాటర్ల జాబితాలో రెండు స్థానాలు ఎగబాకి ఎనిమిదో ర్యాంకుకు చేరుకుంది. మరోవైపు, జింబాబ్వేతో ఇటీవల జరిగిన మ్యాచ్‌ల్లో 32, సున్నా పరుగులే చేసిన భారత కెప్టెన్ స్మృతి మంధాన అగ్రస్థానం కోల్పోయి రెండో స్థానానికి పడిపోయింది. దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్ట్ నంబర్‌వన్ స్థానాన్ని దక్కించుకుంది.



స్థానిక వాహనదారులకు పాస్

• టోల్ ప్లాజాకు 20 కి.మీ. పరిధిలో నివసించే వారికి రాయితీ
• రూ.1,500కే వార్షిక టోల్ పాస్.. నవంబరు 1 నుంచి అమల్లోకి

న్యూఢిల్లీ: టోల్ ప్లాజాల సమీపంలో నివసించే వాహనదారులకు కేంద్ర ప్రభుత్వం ఊరటనిచ్చింది. తరచూ టోల్ ప్లాజాల మీదుగా రాకపోకలు సాగించే వ్యక్తిగత వాహనదారుల కోసం రాయితీతో కూడిన స్థానిక వార్షిక పాస్‌ను అందుబాటులోకి తెచ్చింది. టోల్ ప్లాజాకు 20 కిలోమీటర్ల పరిధిలో నివసించే అర్హులు రూ.1,500 చెల్లించి ఈ పాస్ పొందవచ్చు. నవంబరు 1 నుంచి ఇది అమల్లోకి రానుంది. ఈ మేరకు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ సంబంధిత నిబంధనలను సవరించింది. ఈ స్థానిక పాస్ సంబంధిత టోల్ ప్లాజాకు మాత్రమే వర్తిస్తుంది. ఇతర మార్గాల్లోని టోల్ ప్లాజాల వద్ద దీనిని వినియోగించలేరు. జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలపై ఇతర ప్రాంతాలకు ప్రయాణించినప్పుడు సాధారణ టోల్ రుసుములు చెల్లించాల్సిందే. ప్రత్యామ్నాయ మార్గం లేదా సర్వీసు రోడ్డు అందుబాటులో ఉన్న చోట స్థానిక పాస్ జారీ చేయరు. వాణిజ్య వాహనాలకు ఈ రాయితీ వర్తించదు. మున్సిపాలిటీలు, పట్టణ ప్రాంతాల పరిధిలోని వాహనదారులకు రూ.3వేలు చెల్లించాలి.

ప్రస్తుత పాస్ ధర రూ.3,000

ప్రస్తుతం వ్యక్తిగత వాహనదారులకు వార్షిక టోల్ పాస్ రూ.3,000కు అందుబాటులో ఉంది. ఈ పాస్‌తో ఏడాది పాటు లేదా 200 ట్రిప్పుల వరకు ప్రయాణించవచ్చు. ఈ రెండింటిలో ఏది ముందుగా పూర్తయితే అప్పటితో పాస్ గడువు ముగుస్తుంది. ఏటా ఏప్రిల్ 1న టోల్ పాస్ ఛార్జీలను సవరించే అవకాశం కేంద్రానికి ఉంటుంది.

ఎల్‌అండ్‌టీకి ఢాకా మెట్రో ప్రాజెక్టు

• రెండు కీలక వ్యవస్థల రూపకల్పన, నిర్మాణ పనులకు ఆర్డర్లు



న్యూఢిల్లీ: ప్రముఖ నిర్మాణ, ఇంజినీరింగ్ సంస్థ లార్సెన్ అండ్ టూబ్రో (ఎల్‌అండ్‌టీ) బంగ్లాదేశ్ రాజధాని ఢాకా మెట్రో ప్రాజెక్టుకు సంబంధించిన ఆర్డర్లను దక్కించుకుంది. ఢాకా మెట్రో లైన్–1లో రెండు కీలక వ్యవస్థల రూపకల్పన, నిర్మాణ పనుల కోసం ఈ ఆర్డర్లు లభించినట్లు సంస్థ మంగళవారం ప్రకటించింది. గతంలో ఢాకా మెట్రో లైన్–6కు సమీకృత రైల్వే వ్యవస్థల ప్యాకేజీని ఎల్‌అండ్‌టీ దక్కించుకుని పనులు పూర్తి చేసింది. బంగ్లాదేశ్‌లో తొలి మెట్రో మార్గమైన ఈ లైన్ ప్రస్తుతం వాణిజ్య కార్యకలాపాలు నిర్వహిస్తోంది. జపాన్ అంతర్జాతీయ సహకార సంస్థ (జైకా) ఆర్థిక సాయంతో చేపడుతున్న లైన్–1 ప్రాజెక్టు సుమారు 31 కిలోమీటర్ల మేర ఆధునిక ప్రజా రవాణా వ్యవస్థను అందుబాటులోకి తీసుకురానుంది.

నవీ ముంబైకి ఆకాసా విమానాలు

• డిసెంబరు నుంచి జెడ్డా సర్వీసుల తరలింపు
• రద్దీ తగ్గించేందుకు ముంబై విమానాశ్రయ టెర్మినల్–1 ఆధునికీకరణ
• తొలి దశలో 50లక్షల మంది ప్రయాణికులను మళ్లించే లక్ష్యం



ముంబై: ముంబైలో ముంబైకి జంట విమానాశ్రయ వ్యవస్థ అభివృద్ధికి మరో ముందడుగు పడింది. ఆకాసా ఎయిర్ సంస్థ ముంబై–జెడ్డా విమాన సర్వీసులను 2026 డిసెంబరు నుంచి దశలవారీగా ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయానికి (ఎన్ఎంఐఏ) తరలించనుంది. అక్టోబరు 26 నుంచే ఈ సర్వీసులకు బుకింగ్‌లు ప్రారంభమయ్యాయి. ఇండిగో, ఎయిరిండియా గ్రూప్ కూడా డిసెంబరు నుంచి తమ విమానాలను దశలవారీగా నవీ ముంబైకి తరలించనున్నాయి. రెండు విమానాశ్రయాల నిర్వహణ సంస్థ అదానీ ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్‌తో విమానయాన సంస్థలు 18 నెలలపాటు చర్చించిన అనంతరం ఈ నిర్ణయాలు తీసుకున్నాయి. ప్రస్తుతం ఏటా 5.5 కోట్ల మంది ప్రయాణికులకు సేవలందిస్తున్న ముంబై విమానాశ్రయంలో రద్దీని తగ్గించి, టెర్మినల్–1ను ఆధునికీకరించడం ఈ తరలింపు ప్రధాన ఉద్దేశం. తొలి దశలో సుమారు 50 లక్షల మంది ప్రయాణికుల రాకపోకలను నవీ ముంబైకి మళ్లించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో 30 లక్షల మంది ప్రయాణికులను విమానయాన సంస్థల ప్రణాళికల ప్రకారం తరలించనున్నారు. ఆధునికీకరణ సమయంలోనూ ప్రస్తుత విమానాశ్రయంలో 91 శాతం రాకపోకలు కొనసాగనున్నాయి.

2 కోట్లకు టెర్మినల్ సామర్థ్యం

టెర్మినల్–1 పునరాభివృద్ధితో వార్షిక ప్రయాణికుల సామర్థ్యం 1.5 కోట్ల నుంచి 2 కోట్లకు పెరగనుంది. భద్రతా వ్యవస్థలు, డిజిటల్ సేవలు, తనిఖీ ప్రక్రియలను మెరుగుపరచనున్నారు. పనులు పూర్తయ్యాక విమానయాన సంస్థలకు గతంలో కేటాయించిన స్లాట్లను తిరిగి పునరుద్ధరిస్తారు. నవీ ముంబై విమానాశ్రయం తొలి దశలో ఏటా 2 కోట్ల మంది ప్రయాణికులకు సేవలందించేలా రూపొందించారు. భవిష్యత్తులో విస్తరణతో ఈ సామర్థ్యాన్ని 9 కోట్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆటోమేటెడ్ బ్యాగేజీ నిర్వహణ, డిజిటల్ తనిఖీ వ్యవస్థలు, రహదారి అనుసంధానాలు అభివృద్ధి చేయనున్నారు. రెండు విమానాశ్రయాల విస్తరణతో అంతర్జాతీయ అనుసంధానం, కొత్త విమాన మార్గాలు, ప్రయాణికులకు ఎంపికలు పెరగనున్నాయి. అయితే, సర్వీసుల తరలింపు దశలవారీగా జరగనున్నందున టికెట్ బుకింగ్ సమయంలో, ప్రయాణానికి ముందు విమానాశ్రయం వివరాలను తప్పనిసరిగా సరిచూసుకోవాలని సూచించారు.

టెలికాం రంగంలో జియో ఆధిపత్యం

• సెప్టెంబరులో 27.13 లక్షల కొత్త కనెక్షన్లు
• రెండో స్థానంలో ఎయిర్‌టెల్
• పెరిగిన బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు



న్యూఢిల్లీ: దేశీయ టెలికాం రంగంలో రిలయన్స్ జియో ఆధిపత్యం కొనసాగుతోంది. సెప్టెంబరులో ఆ సంస్థకు 27.13 లక్షల మంది కొత్త మొబైల్ చందాదారులు చేరారు. 26.92 లక్షల మందితో భారతీ ఎయిర్‌టెల్ రెండో స్థానంలో నిలిచింది. ట్రాయ్ మంగళవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. వొడాఫోన్ ఐడియాకు 5.50 లక్షలు, బీఎస్ఎన్ఎల్‌కు 6.26 లక్షల మంది కొత్త వినియోగదారులు జతయ్యారు. సెప్టెంబరు చివరికి జియో మొబైల్ చందాదారుల సంఖ్య 51.11 కోట్లకు, ఎయిర్‌టెల్ వినియోగదారుల సంఖ్య 49.43 కోట్లకు చేరింది. వొడాఫోన్ ఐడియాకు 20 కోట్లకు పైగా, బీఎస్ఎన్ఎల్‌కు 9.43 కోట్ల మంది చందాదారులున్నారు. మార్కెట్ వాటాలో జియో 39.32 శాతంతో అగ్రస్థానంలో ఉండగా.. ఎయిర్‌టెల్ 38.02 శాతం, వొడాఫోన్ ఐడియా 15.39 శాతం వాటా కలిగి ఉన్నాయి.

130 కోట్లకు మొబైల్ చందాదారులు

దేశంలో మొబైల్ చందాదారులు సెప్టెంబరులో 65.74 లక్షలు పెరిగి దాదాపు 130 కోట్లకు చేరారు. నెలవారీ వృద్ధి 0.51 శాతంగా నమోదైంది. స్థిర వైర్‌లెస్ యాక్సెస్ కనెక్షన్లతో కలిపి మొత్తం వైర్‌లెస్ చందాదారులు 69.41 లక్షలు పెరిగి 131.92 కోట్లకు చేరుకున్నారు. వైర్‌లైన్ కనెక్షన్లతో కలిపి మొత్తం టెలిఫోన్ చందాదారులు 136.79 కోట్లుగా నమోదయ్యారు. క్రియాశీల మొబైల్ వినియోగదారులు 121.28 కోట్ల మంది ఉన్నారు. సెప్టెంబరులో మొబైల్ నంబర్ పోర్టబిలిటీ కోసం 1.68 కోట్ల మంది దరఖాస్తు చేసుకున్నారు. బ్రాడ్‌బ్యాండ్ చందాదారులు 110.12 కోట్ల నుంచి 110.77 కోట్లకు పెరిగారు. యంత్రాల మధ్య సమాచార మార్పిడికి ఉపయోగించే ఎం2ఎం సెల్యులార్ కనెక్షన్లు 14 కోట్ల నుంచి 14.4 కోట్లకు చేరాయి. ఈ విభాగంలో ఎయిర్‌టెల్ 8.858 కోట్ల కనెక్షన్లతో 61.16 శాతం వాటా కలిగి ఉంది. జియోకు 19.29 శాతం, వొడాఫోన్ ఐడియాకు 16.14 శాతం, బీఎస్ఎన్ఎల్‌కు 3.41 శాతం వాటా ఉంది.

మార్కెట్లకు చమురు సెగ

• స్వల్ప నష్టాలతో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం తీవ్ర ఒడుదొడుకుల మధ్య స్వల్ప నష్టాలతో ముగిశాయి. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరగడం, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్ల నిర్ణయంపై ఉత్కంఠ మదుపర్లను అప్రమత్తంగా ఉంచాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 8.08 పాయింట్లు తగ్గి 73,598.67 వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 3.45 పాయింట్లు క్షీణించి 22,749.75 వద్ద స్థిరపడ్డాయి. సెన్సెక్స్‌లో ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంక్, టీసీఎస్, ఏషియన్ పెయింట్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ నష్టపోయాయి. భారతి ఎయిర్‌టెల్, ట్రెంట్, మారుతి, పవర్‌గ్రిడ్ లాభపడ్డాయి. ఐటీ, ప్రైవేటు బ్యాంకింగ్ షేర్లలో లాభాల స్వీకరణ కనిపించగా.. ఔషధ, ఆటోమొబైల్, ప్రభుత్వ రంగ బ్యాంకులు, రియల్టీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ ముడి చమురు ధర బ్యారెల్‌కు 115.8 డాలర్లకు చేరింది. చమురు ధరల పెరుగుదల, ఫెడ్ నిర్ణయంపై ఎదురుచూపులు సూచీలకు అడ్డంకిగా మారాయని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ పరిశోధన విభాగాధిపతి వినోద్ నాయర్ తెలిపారు. విస్తృత మార్కెట్లో కొనుగోళ్ల కొనసాగడం దేశీయ మదుపర్ల ఆశావాదాన్ని సూచిస్తోందన్నారు. సోమవారం విదేశీ సంస్థాగత మదుపర్లు రూ.1,462.49 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు.

‘వృషకర్మ’కు దిల్ రాజు భారీ డీల్



యువసమ్రాట్ అక్కినేని నాగచైతన్య కథానాయకుడిగా, కార్తీక్ దండు దర్శకత్వంలో తెరకెక్కుతున్న పౌరాణిక థ్రిల్లర్ ‘వృషకర్మ’. శ్రీ వెంకటేశ్వర సినీచిత్ర, సుకుమార్ రైటింగ్స్ పతాకాలపై బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ బి సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని బాపినీడు సమర్పిస్తున్నారు. సరికొత్త పౌరాణిక మిస్టరీ, ఉత్కంఠభరిత కథాంశంతో భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమా డిసెంబరు 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. కాగా, విడుదలకు ముందే ఈ చిత్రం వ్యాపార వర్గాల్లో ఆసక్తిని పెంచుతోంది. తాజాగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల థియేట్రికల్ పంపిణీ హక్కులను



ప్రముఖ నిర్మాత, పంపిణీదారుడు దిల్ రాజుకు చెందిన శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ భారీ మొత్తానికి సొంతం చేసుకుంది. నాగచైతన్య కెరీర్‌లోనే అత్యధిక ప్రీరిలీజ్ థియేట్రికల్ వ్యాపారాన్ని నమోదు చేసిన చిత్రంగా ‘వృషకర్మ’ నిలవడం విశేషం. కథాంశం, విజువల్స్‌పై ఉన్న నమ్మకంతో దిల్ రాజు ఈ హక్కులను భారీ ధరకు దక్కించుకోవడంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. ఇటీవల కీలక సన్నివేశాల కోసం ప్రత్యేకంగా నిర్మించిన భారీ గుహ సెట్ రూపకల్పనకు సంబంధించిన తెరవెనుక దృశ్యాలను చిత్రబృందం విడుదల చేయగా విశేష స్పందన లభించింది. ఇప్పటికే ప్రచార చిత్రాలు, నిర్మాణ విశేషాల వీడియోలు సామాజిక మాధ్యమాల్లో మంచి ఆదరణ పొందుతున్నాయి. ఈ చిత్రంలో నాగచైతన్యకు జోడీగా మీనాక్షి చౌదరి నటిస్తుండగా, ప్రతినాయకుడి పాత్రలో స్పర్ష్ శ్రీవాస్తవ కనిపించనున్నారు. సాంకేతికంగానూ ఉన్నత ప్రమాణాలతో సినిమాను రూపొందిస్తున్నారు. అజనీష్ బి. లోక్‌నాథ్ సంగీతం అందిస్తుండగా, రఘుల్ డి. హేరియన్ ఛాయాగ్రహణం, శ్రీ నాగేంద్ర తంగాల ప్రొడక్షన్ డిజైన్, నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నాగచైతన్య కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ పౌరాణిక అడ్వెంచర్ థ్రిల్లర్‌ను ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది. త్వరలోనే భారీ స్థాయిలో ప్రచార కార్యక్రమాలను ప్రారంభించనున్నారు.

ట్రోలింగ్‌ను పట్టించుకోను

రణబీర్ కపూర్, సాయిపల్లవి జంటగా, నితీశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పౌరాణిక చిత్రం ‘రామాయణ: రైజ్ ఆఫ్ ఎ లెజెండ్’. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. అయితే, ఈ సినిమాలోని ‘రావణ తాండవ్’ పాటతో పాటు తాజాగా విడుదలైన ‘మంగళ్ రంగ్’ గీతంపై సామాజిక మాధ్యమాల్లో విమర్శలు, ట్రోలింగ్ మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో స్పందించిన రెహమాన్.. సామాజిక మాధ్యమాల్లో వచ్చే ట్రోలింగ్, అభిప్రాయాలను తాను పెద్దగా పట్టించుకోనని స్పష్టం చేశారు. పాటలను రూపొందించేందుకు ఎన్నో పరిశీలనలు, కసరత్తులు చేస్తామని, ఆ ప్రక్రియ పూర్తయ్యేసరికి తమ శక్తి కూడా ఖర్చవుతుందని తెలిపారు. ఎవరికి అప్పగించిన పనిని వారు శ్రద్ధగా చేయాలన్నదే తన నమ్మకమని పేర్కొన్నారు. మొదట్లో విమర్శించినవారు సైతం ఆ తర్వాత పాటలను ఆస్వాదించి ప్రశంసిస్తారని అభిప్రాయపడ్డారు. గతంలో ‘రావణ తాండవ్’ పాట విడుదలైనప్పుడు కూడా తొలుత వ్యతిరేకత వ్యక్తమైనప్పటికీ, ఆ తర్వాత శ్రోతల నుంచి మంచి ఆదరణ లభించిందని రెహమాన్ గుర్తుచేశారు.

టాలీవుడ్‌లో ప్రస్తుతం వరుస అవకాశాలతో దూసుకుపోతున్న కథానాయిక సంయుక్త మీనన్ ఖాతాలో మరో క్రేజీ ప్రాజెక్ట్ చేరినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. తెలుగు, తమిళ భాషల్లో వరుస సినిమాలతో బిజీగా ఉన్న ఈ భామకు తాజాగా నందమూరి బాలకృష్ణ సరసన నటించే అవకాశం వచ్చినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. బాలయ్య, దర్శకుడు కొరటాల శివ కలయికలో తెరకెక్కనున్న భారీ చిత్రంలో కథానాయికగా సంయుక్తను ఎంపిక చేసినట్లు సమాచారం. అయితే దీనిపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రస్తుతం సంయుక్త చేతిలో ‘బెంజ్’, ‘బ్లాక్ గోల్డ్’, ‘స్వయంభు’, ‘స్లమ్ డాగ్’, ‘హైందవ’ వంటి ప్రాజెక్టులు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. విభిన్నమైన కథలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న ఆమె, వరుస అవకాశాలతో కెరీర్‌లో బిజీగా కొనసాగుతున్నారు. ఈ క్రమంలోనే బాలకృష్ణ వంటి అగ్ర కథానాయకుడి సరసన నటించే అవకాశం

బాలయ్య సరసన సంయుక్త మీనన్

మరో క్రేజీ ఛాన్స్

దక్కిందన్న వార్త ఆసక్తిని పెంచుతోంది. మరోవైపు, బాలయ్యతో కొరటాల శివ సినిమా చేయనున్నారన్న ప్రచారం కూడా సినీ అభిమానుల్లో చర్చనీయాంశంగా మారింది. గతంలో బాలకృష్ణ నటించిన ‘అఖండ–2’ ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయిందన్న అభిప్రాయాల నేపథ్యంలో, ఈ కొత్త ప్రాజెక్ట్‌పై ఆసక్తి నెలకొంది. అయితే ఈ సినిమాకు సంబంధించి దర్శకుడు, కథానాయిక ఎంపిక, ఇతర నటీనటుల వివరాలపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. సంయుక్త మీనన్ ఈ సినిమాలో నటించడం ఖరారైతే బాలయ్యతో ఆమెకు ఇదే తొలి కలయిక కానుంది. నటనకు ప్రాధాన్యమున్న పాత్రలతో పాటు వాణిజ్య చిత్రాల్లోనూ తనదైన ముద్ర వేస్తున్న సంయుక్తకు ఈ సినిమా మరో కీలక అవకాశంగా మారే అవకాశం ఉంది.

వాయిదా పుకార్లకు షారుఖ్ చెక్

బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ కథానాయకుడిగా నటిస్తున్న భారీ యాక్షన్ డ్రామా ‘కింగ్’పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో షారుఖ్ తన కుమార్తె సుహానా ఖాన్‌తో కలిసి తొలిసారిగా తెరను పంచుకుంటున్నారు. అభిషేక్ బచ్చన్, రాణి ముఖర్జీ, దీపికా పదుకొణె, అనిల్ కపూర్, జాకీ ష్రాఫ్, జైదీప్ అహ్లావత్, అర్షద్ వార్సీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాను డిసెంబరు 24న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ఇప్పటికే ప్రకటించింది. అయితే, విడుదల తేదీ దగ్గరపడుతున్నా ప్రచార కార్యక్రమాలు ప్రారంభం కాకపోవడంతో సినిమా వాయిదా పడనుందంటూ సామాజిక మాధ్యమాల్లో పుకార్లు మొదలయ్యాయి. హాలీవుడ్ చిత్రాల విడుదల నేపథ్యంలో ‘కింగ్’ వాయిదా పడుతుందనే ఊహాగానాలు కూడా వినిపించాయి. ఈ నేపథ్యంలో తాజాగా షారుఖ్ ఖాన్ విడుదల చేసిన ప్రత్యేక పోస్టర్



ఈ ప్రచారానికి తెరదించింది. ఈ పోస్టర్‌లో చెదిరిన బంగారు రంగు జుట్టు, రక్తపు మరకలతో కూడిన ఛాతీ, చిరిగిన దుస్తులతో ఆయన మునుపెన్నడూ చూడని రఫ్ లుక్‌లో కనిపించారు. చేతిలో తుపాకీ, పెదవుల మధ్య ఎర్ర గులాబీతో మంటలు, నిప్పురవ్వల నడుమ ముందుకు సాగుతున్న ఆయన అవతారం అభిమానులను ఆకట్టుకుంటోంది. ఈ పోస్టర్‌కు 1999లో వచ్చిన ‘బాద్‌షా’ చిత్రంలోని పాటను గుర్తుచేసేలా ‘ఆజ్ ఫిర్ యాద్ ఆయా.. హంతకుడిని కాదు.. ప్రేమికుడిని’ అనే వ్యాఖ్యను జోడించారు. దీంతో సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది. తాజా పోస్టర్‌తో విడుదల తేదీపై నెలకొన్న సందేహాలకు సమాధానం లభించినప్పటికీ, వాయిదాపై వస్తున్న ఊహాగానాలకు చిత్రబృందం అధికారికంగా స్పష్టత ఇచ్చిందా అనే అంశంపై మరింత సమాచారం రావాల్సి ఉంది. ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ‘కింగ్’ డిసెంబరు 24న ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉంది.

‘ఓం’లో ఐపీఎస్ అధికారిగా సాయిపల్లవి



కోలీవుడ్ స్టార్ ధనుష్, దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి కలయికలో తెరకెక్కుతున్న చిత్రం ‘ఓం’. మమ్ముట్టి, సాయిపల్లవి, శ్రీలీల ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాలో సాయిపల్లవి పాత్రను పరిచయం చేస్తూ చిత్రబృందం ప్రత్యేక గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఇందులో తొలిసారిగా ఖాకీ దుస్తుల్లో ఐపీఎస్ అధికారిణి నిత్యారెడ్డిగా కనిపించి సాయిపల్లవి అభిమానులను, ప్రేక్షకులను ఆశ్చర్యపరిచారు. ఈ సందర్భంగా ఆమె ప్రత్యేక పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. తాజాగా విడుదలైన గ్లింప్స్‌ను పరిశీలిస్తే.. అడవుల్లో జరుగుతున్న ఎర్రచందనం స్మగ్లింగ్‌ను అరికట్టేందుకు నిత్యారెడ్డిని ప్రత్యేక విధులపై నియమించినట్లు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని నవంబర్ 20న తెలుగు, తమిళం, హిందీ భాషల్లో భారీ స్థాయిలో విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.

ఏఐ మార్ఫింగ్‌పై సునైనా ఆగ్రహం

టాలీవుడ్ నటి సునైనా యెల్లాకు సంబంధించినవిగా ప్రచారం జరుగుతున్న అశ్లీల వీడియోలు సామాజిక మాధ్యమాల్లో కలకలం రేపుతున్నాయి. కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ తన ముఖాన్ని మార్ఫింగ్ చేసి అసభ్యకరమైన డిజిటల్ కంటెంట్‌ను ప్రచారం చేస్తున్నారంటూ సునైనా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో ఓ ప్రకటన విడుదల చేస్తూ ఈ చర్యను తీవ్రంగా ఖండించారు. తన రూపాన్ని పోలి ఉండేలా ఏఐ సాయంతో రూపొందించిన కంటెంట్‌ను చూసి దిగ్భ్రాంతికి, అసహ్యానికి గురయ్యానని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ వీడియోలతో తనకు ఎలాంటి సంబంధం లేదని, వాటి రూపకల్పనకు, ప్రచారానికి తాను ఎలాంటి అనుమతి ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఇది తన గౌరవానికి, వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించడమే కాకుండా, లైంగిక వేధింపుల పరిధిలోకి వస్తుందని పేర్కొన్నారు. సమాచార సాంకేతిక చట్టం–





2000, భారతీయ న్యాయ సంహిత–2023 ప్రకారం ఇలాంటి చర్యలు తీవ్రమైన నేరాలుగా పరిగణించే అవకాశం ఉందని హెచ్చరించారు. తనకు సంబంధించినవిగా ప్రచారం చేస్తున్న ఈ వీడియోలను అప్‌లోడ్ చేసినవారు, పంచుకున్నవారు, మళ్లీ ప్రచారం చేసినవారు వెంటనే తొలగించాలని స్పష్టం చేశారు. లేనిపక్షంలో ముందస్తు నోటీసులు ఇవ్వకుండానే బాధ్యులపై క్రిమినల్, సివిల్ చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఈ కంటెంట్‌ను ఎవరూ ఇతరులకు పంపవద్దని, సామాజిక మాధ్యమాల్లో ఎక్కడైనా కనిపిస్తే వెంటనే సంబంధిత వేదికలకు ఫిర్యాదు చేయాలని అభిమానులు, ప్రజలు, మీడియా ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. ఏఐ సాంకేతికతను ఉపయోగించి వ్యక్తుల ప్రతిష్ఠకు భంగం కలిగించే ఇలాంటి చర్యలను ఉపేక్షించేది లేదని సునైనా స్పష్టం చేశారు. ఆమె చేసిన ఈ ప్రకటన ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది.

అయ్యప్ప స్వామి భక్తుడిగా వైభవ్‌రెడ్డి



టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు కోదండరామిరెడ్డి తనయుడిగా చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టిన వైభవ్ రెడ్డి.. తనదైన నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. తెలుగు, తమిళ భాషల్లో విభిన్న చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తున్న ఆయన తాజాగా ‘మణికంద’ అనే తమిళ చిత్రంలో కథానాయకుడిగా నటిస్తున్నారు. మలయాళంలో విజయవంతమైన ‘మాళికాపురం’ చిత్రంతో గుర్తింపు పొందిన దర్శకుడు విష్ణు శశి శంకర్ ఈ ఆధ్యాత్మిక చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ప్రముఖ దర్శకుడు వెంకట్ ప్రభు సృజనాత్మక నిర్మాతగా వ్యవహరిస్తుండగా, తంత్ర ఫిల్మ్స్ ప్రొడక్షన్స్, జేకే శరవనన్ రాజారామ్ సమర్పణలో ఈ చిత్రం రూపొందుతోంది. అయ్యప్ప స్వామి భక్తి, ఆధ్యాత్మికతతోపాటు మాస్ యాక్షన్ అంశాలను మేళవించి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమా నుంచి తాజాగా వైభవ్ రెడ్డి తొలి ప్రచార చిత్రాన్ని చిత్రబృందం విడుదల చేసింది. ఇందులో అయ్యప్ప స్వామి విగ్రహం నేపథ్యంలో మెడలో రుద్రాక్ష మాలలు, చేతులకు రుద్రాక్షలు ధరించి వైభవ్ శక్తిమంతమైన అవతారంలో కనిపిస్తున్నారు. ఈ పోస్టర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని తెలుగు, తమిళం, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. నవంబరు లేదా డిసెంబరులో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని భావిస్తున్నారు. భక్తి, ఆధ్యాత్మికత, యాక్షన్ అంశాలతో రూపొందుతున్న ‘మణికంద’ వైభవ్ కెరీర్‌లో ప్రత్యేక చిత్రంగా నిలుస్తుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

టాలీవుడ్ మాచో స్టార్ గోపీచంద్ వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం ఆయన ‘భరతవర్ష: సాగా ఆఫ్ శూల’ అనే చారిత్రక యాక్షన్ డ్రామాతో పాటు ‘సింగ’ చిత్రంలో నటిస్తున్నారు. వీటితోపాటు ప్రముఖ నిర్మాత దిల్ రాజుకు చెందిన శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై మరో భారీ చిత్రంలో నటించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ సినిమాతో కుమార్ మిస్టిక్ దర్శకుడిగా పరిచయం కానుండటం విశేషం. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన తొలి షెడ్యూల్ లండన్‌లో ప్రారంభమైనట్లు సమాచారం. తదుపరి షెడ్యూళ్లను పారిస్, స్కాట్లాండ్‌లో చిత్రీకరించేందుకు చిత్రబృందం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే.. తాజాగా ఈ ప్రాజెక్టుకు సంబంధించి మరో ఆసక్తికర వార్త సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. ఈ సినిమాలో గోపీచంద్‌కు జోడీగా కనక్ అగ్నిహోత్రి నటించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే, దీనిపై చిత్రబృందం నుంచి

గోపీచంద్ సరసన

కనక్ అగ్నిహోత్రి

అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. వృత్తిరీత్యా న్యాయవాది అయిన కనక్ అగ్నిహోత్రి మోడల్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. మిస్ యూనివర్స్ ఉత్తరప్రదేశ్–2024 కిరీటాన్ని సొంతం చేసుకోవడంతోపాటు, మిస్ యూనివర్స్ ఇండియా–2024 పోటీల్లో జాతీయ స్థాయి ఫైనలిస్ట్‌గా నిలిచారు. అలాగే మిస్ నవీ ముంబై–2024, మిస్ ముంబై టైటిళ్లను కూడా గెలుచుకున్నారు. మోడలింగ్ రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆమె.. గోపీచంద్ చిత్రంతో కథానాయికగా టాలీవుడ్‌లోకి అడుగుపెట్టనున్నారనే వార్త ప్రస్తుతం ఆసక్తిని రేకెత్తిస్తోంది. గోపీచంద్, దిల్ రాజు, కుమార్ మిస్టిక్ కలయికలో రూపొందనున్న ఈ సినిమాకు సంబంధించిన కథానాయిక ఎంపికపై అధికారిక స్పష్టత రావాల్సి ఉండగా, తాజా ప్రచారంతో ఈ ప్రాజెక్టుపై సినీ అభిమానుల్లో ఆసక్తి పెరుగుతోంది.



Published And Owned By Adula Thirupathi, And Printed By Bommakanti Vinod Kumar, At Vangs Global Technologies Llp, #1-5-431/20/4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri, Telangana - 500010. And Published From D. No.: 8-3-228/157/A/1a, Rehmath Nagar, Jawahar Nagar, Yousufguda, Hyderabad, Telangana - 500045. **Editor: Adula Thirupathi. PRGI Regd No: TGTEL/26/A6187**, Email: Prajanaava@Gmail.Com. Phone No: 99484 33277.